

అమరావతిలో ఆర్థికం



ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు సీఆర్డీఏ శ్రీకారం

- కార్యాలయాలు, నివాసాలకు 27.855 ఎకరాలు కేటాయింపు
- 28న బ్యాంకు, ఎల్ఐసీ, ఆదాయపు పన్ను కార్యాలయాలకు శంకుస్థాపన
- హాజరు కానున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్
- సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం సమీపంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా ప్రజారాజధాని అమరావతి ముస్తాబవుతోంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ) రాజధాని అమరావతిలో ప్రతిపాదిత ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పాటును వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టింది. పలు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు, ఇన్స్యూరెన్స్, ఇన్‌కం టాక్స్ వంటి పలు ప్రభుత్వ అనుబంధ ఆర్థిక కార్యాలయాల శంకుస్థాపన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా సంస్థల కార్యాలయాలు, ఉద్యోగుల నివాసాలకు అవసరమైన స్థలాల కేటాయింపును పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 28న ఆయా కార్యాలయ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన జరగనున్నట్లు సీఆర్డీఏ కార్యాలయం తాజాగా ప్రకటించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అమరావతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు సీఆర్డీఏ చేస్తోంది. అమరావతిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం సమీపంలోని బ్లాక్- 1 వద్ద జరిగే కార్యక్రమంలో, రాజధానిలో ఏర్పాటు కానున్న పలు బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేయనున్నారు.

● మూడు విభాగాలుగా స్థలాల కేటాయింపు

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పాటు పనుల్లో భాగంగా బ్యాంకులు, ఆర్థిక అనుబంధ సంస్థలకు కేటాయించిన స్థలాలను కార్యాలయాలు, సిబ్బంది వసతి, అనుబంధ సంస్థలు అనే మూడు విభాగాలుగా స్థలాలు కేటాయించారు. బ్యాంకులు, కార్యాలయ భవనాల నిర్మాణం కోసం 9.695 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. భారతీయ స్టేట్ బ్యాంకు, కెనరా, నాబార్డు, యూనియన్ బ్యాంకు సహా 12 బ్యాంకులు ఇక్కడ కార్యాలయాలను నిర్మించుకోనున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ), లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ), ఆదాయపు పన్నుశాఖ వంటి కీలకమైన అనుబంధ సంస్థల కోసం 5.80 ఎకరాలు కేటాయించారు. సిబ్బంది వసతి, సంస్థాగత టౌన్‌షిప్ అభివృద్ధిని సులభతరం చేయడానికి వీలుగా నివాస స్థలాలకు 7.02 ఎకరాలు, ఆర్బీఐ వంటి అనుబంధ సంస్థల ఉద్యోగుల నివాసాలకు 4.54 ఎకరాలు, మొత్తంగా 11.56 ఎకరాలు నివాసస్థలాలను కేటాయించారు. మొత్తంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పాటులో భాగంగా అమరావతిలో మొత్తం 27.855 ఎకరాల స్థలం కేటాయించారు.

కేటాయింపు రకం	స్థలం (ఎకరాల్లో)
ప్రభుత్వ రంగ బ్యాంకులు	9.695
ప్రైవేటు బ్యాంకులు	0.80
అనుబంధ సంస్థలు	5.80
నివాస స్థలాలు(బ్యాంకు)	7.02
ఆర్బీఐ, ఎన్ఐపీసీఎల్	4.54

సాగు సిరులు

దిగుబడి ఇలా..

- పల్నాడు జిల్లాలో 1,40,643 ఎకరాల్లో వరి సాగైంది. జిల్లాలో 3,48,090 టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా.
- బాపట్ల జిల్లాలో 2,57,828 ఎకరాల్లో వరి సాగు కాగా 6,38,124 టన్నుల ధాన్యం దిగుబడి కానున్నది.
- గుంటూరు జిల్లాలో 1,55,005 ఎకరాల్లో వరి సాగు చేయగా 3,83,637 టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

అన్నదాతల్లో ఆనందం

- ఆశాజనకంగా ధాన్యం దిగుబడులు
- మూడు జిల్లాల్లో 13.69 లక్షల టన్నుల అంచనా
- మద్దతు ధర ప్రకారం సుమారు రూ.3,243 కోట్ల ఉత్పత్తి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్‌లో వరి సాగు సిరులు కురిపిస్తోంది. సకాలంలో సాగర్, డెల్టా ఆయకట్టుకు ప్రభుత్వం పుష్కలంగా కృష్ణా జలాలను సరఫరా చేసింది. దీంతో గతంలో కంటే ఈసారి ముందస్తుగా రైతులు వరి సాగు చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో అంచనాలకు మించి వరి సాగైంది. ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూడు జిల్లాల్లో 5.53 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరాకు ధాన్యం 30 నుంచి 35 బస్తాలకు వరకు దిగుబడి కానున్నది. సగటు దిగుబడి 33 బస్తాలుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ ప్రకారం మూడు జిల్లాలో 13,69,851 టన్నుల ధాన్యం దిగుబడి కానున్నది. ఈ దిగు బడుల ఆధారంగా ప్రభుత్వ మద్ద తు ధర క్వింటాల్‌కు రూ.2,369 ప్ర కారం లెక్కిస్తే దాదాపు రూ.3,243 కోట్ల విలువైన ధాన్యం ఉత్పతి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ధాన్యానికి మద్దతు ధర అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. ధాన్యం కొనుగోలు లక్ష్యాలు మొత్తం దిగు బడిలో 10 శాతం కూడా లేకపోవడం గమనార్హం. పల్నాడు జిల్లాలో వరి నూర్పిళ్లు పూర్తి చేసిన రైతులు దాళ్వాలో వరి సాగుకు సమాయత్తమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు నారు మళ్లు సాగు చేపడుతున్నారు. ఈ ఏడాది కూడా రబీలో వరి సాగు పెరుగు తుందని అంచనా.



• ధాన్యం బస్తాలు



నెల రోజుల్లో నూర్పిళ్లు పూర్తి..

ప్రస్తుతం ముమ్మరంగా నూర్పిళ్లు జరుగుతున్నాయి. అయితే తుపానుపై వాతావరణశాఖ హెచ్చరిక అన్నదాతలను వణికిస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో యంత్రాలతో రైతులు నూర్పిళ్లు చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా ఎక్కడికక్కడ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాతావరణం అనుకూలిస్తే రానున్న నెల రోజుల్లో నూర్పిళ్లు పూర్తియ్యే అవకాశం ఉంది. పల్నాడు జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ధాన్యం దిగుబడి అవుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు 30 బస్తాలు దిగుబడి వస్తుండగా మరి కొన్ని ప్రాంతాల్లో 35 బస్తాలకు పైగా వస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.



గురుకుల పాఠశాల భవన శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

విద్యలో నరసాయపాలేనికి గుర్తింపు

- గురుకుల భవనం ప్రారంభోత్సవంలో ఎంపీ తెన్నేటి

బాపట్లరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యాదానంలో నరసాయపాలేనికి ప్రత్యేక గుర్తింపు ఉందని లోకసభ ప్యానల్ స్పీకర్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని నరసాయపాలెం గ్రామంలో రూ1.10 కోట్లతో నిర్మించిన అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. నరసాయపాలెం నుంచి చాలామంది ఉన్నత పదవులు, ఉద్యోగాల్లో ఉన్నారన్నారు. ఏ పరిస్థితుల నుంచి వచ్చామన్నది ముఖ్యంకాదని ఏమి సాధించామన్నదే ముఖ్యమని, ఈ విషయం విద్యార్థులు గుర్తుపెట్టుకోవాలన్నారు. అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని చక్కగా చదువుకుని గ్రామానికి, దేశానికి మంచి పేరు తేవాలన్నారు. ఆడపిల్లల విద్యను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. తరగతి గదిలోని లాస్ట్‌బెంచ్ విద్యార్థులపై కూడా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ విద్యలో నరసాయపాలెం గ్రామానికి నియోజకవర్గంలోనే ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ గ్రామం నుంచి ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా సేవలు అందిస్తున్న వారెందరో ఉన్నారన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి కన్నెగంటి పాపారావు పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల అదనపు కార్యదర్శి సునీల్‌రాజ్‌కుమార్, ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ సలీమా, ఇండియన్ పోస్టల్ సర్వీస్ విశ్రాంత అధికారి సంధ్యారాణి, బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి లేని బాపట్ల

జిల్లా పునర్విభజనకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

మారనున్న జిల్లా స్వరూపం.. ప్రకాశం జిల్లాలోకి అద్దంకి ● ఐదు నియోజక వర్గాలకే పరిమితం కానున్న బాపట్ల జిల్లా

(బాపట్ల, అద్దంకి - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరులో భాగంగా ఉన్న బాపట్ల, రేపల్లె, వేమూరు, ఉమ్మడి ప్రకాశంలో భాగమైన అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాలతో 2022 ఏప్రిల్ 4న బాపట్ల జిల్లా ఆవిర్భవించింది. ఈ మేళవింపుపై అప్పట్లో పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తమైనా వాటిని అప్పటి ప్రభుత్వం వైసీపీ పాలకులు బేఖాతరు చేశారు. అద్దంకి నియోజకవర్గ ప్రజలు తమకు బాపట్ల దూరాభారం అవడంతో పాటు చిరకాలంగా ప్రకాశం జిల్లాతో సంబంధాలు దృష్ట్యా బాపట్ల జిల్లాలో భాగం కావడానికి అయిష్టంగానే ఒప్పుకున్నారు. ఈ క్రమంలో జిల్లా ఏర్పాటు విష యంలో సరైన కసరత్తు జరగలేదని, తాము అధికారంలోకి వస్తే అద్దంకి ప్రజల అభీష్టానికి అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని టీడీపీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది. ఇందులో భా గంగానే మంత్రి వర్గ ఉపసంఘం ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించింది. అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడంతో పాటు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపడానికి కూడా సీఎం చంద్రబాబు మంగళవారం అనుమతిచ్చారు. అద్దంకి నియోజకవర్గంలోని ఐదు మండలాలతో పాటు దర్శి నియోజకవర్గంలోని మండలాలు కూడా అద్దంకి డివిజన్ పరిధిలోకి చేరే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్, అభ్యంతరాల స్వీకరణ తదితర అంకాలను పూర్తి చేసుకుని రాబోయే సంక్రాంతికి ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. దీంతో అద్దంకిలేని జిల్లాగా త్వరలోనే బాపట్ల స్వరూపం మారనుంది. వైసీపీ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం ఫలితంగా ఏర్పడిన జిల్లా మూడున్నరేళ్లకే స్వరూపం మారాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆరు నియోజకవర్గాలు కాస్తా ఐదుకే పరిమితం కానున్నాయి. అద్దంకి ప్రకాశం జిల్లాలో



భాగం కావడం వల్ల చీరాల రెవెన్యూ డివిజన్ ఐదు మండలాలకే పరిమితం కానుంది. పర్చూరు నియోజకవర్గంలోని మూడు మండలాలు చీరాల రెవెన్యూ డివిజన్‌లో భాగం కాగా, మరో మూడు బాపట్ల డివిజన్‌లో భాగంగా ఉన్నాయి. వీటి విషయంలో కూడా మార్పులు, చేర్పులపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే జిల్లాకు గ్రానైట్ ఫ్యాక్టరీల పరంగా అద్దంకి తలమానికంగా ఉండేది. ఇప్పుడు మార్టూరు మండలం ఒక్కటే గ్రానైట్ రంగానికి అడ్రస్‌గా జిల్లాలో మిగలనున్నది. ఇవే కాకుండా జిల్లాకు పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో కూడా భారీగా కోత పడనున్నది. స్వరూపం మార్చుకుని ఐదు నియోజకవర్గాలతో పునర్విభజించబడే బాపట్ల జిల్లాకు అద్దంకి లేని లోటు ఇకపై స్పష్టంగా కనబడనుంది

ప్రస్తుతం జిల్లాలో ఇద్దరు మంత్రులు

రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇద్దరూ బాపట్ల జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వారే. అద్దంకి ప్రకాశం జిల్లాలోకి వెళ్లడం ఖాయమైంది కనుక, మంత్రి రవికుమార్ ప్రకాశం జిల్లా పరిధిలోకి వెళ్తారు. అప్పుడు జిల్లా పరిధిలో అమాత్యులుగా మంత్రి అనగాని ఒక్కరే ఉండనున్నారు.



బంగారం దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

బంగారం దుకాణంలో తనిఖీలు

- తూకంలో వ్యత్యాసం.. రూ.2 లక్షల జరిమానా
- ఆలస్యంగా వెలుగులోకి.. వినియోగదారుల ఆందోళన

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతలశాఖ అధికారుల తనిఖీల్లో చీరాలలో కొందరు బంగారు దుకాణదారుల దోపిడీ వెలుగుచూసింది. తనిఖీలో తూకంలో వ్యత్యాసాన్ని గుర్తించిన అధికారులు దుకాణదారుడికి జరిమానా విధించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శుక్రవారం తూనికలు, కొలతలశాఖ శాఖ జాయింట్ కంట్రోలర్ మాధురీ సహాయ కంట్రోలర్ లిల్లీ, ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వరరావు, రామదాసు ఓ దుకాణంలోకి వెళ్లారు. నల్లపూసల తాడుకు పూసలు తొలగించి తూకాన్ని పరిశీలించారు. దానికి తొలుత ఉన్న ట్యాగుకు, వాస్తవ తూకానికి మధ్య వ్యత్యాసం సుమారు 250 నుంచి 300 వరకు మిల్లీ గ్రాముల ఉన్నట్లు అధికారులు గుర్తించి దుకాణదారుడిపై కేసు నమోదు చేశారు. రూ.2 లక్షల జరిమానా విధించారు. పట్టణంలోని వెంకటరమణ జ్యూయలర్స్‌లో శుక్రవారం తనిఖీలు నిర్వహించామని, తూకాల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించినట్లు అధికారి పి.లిల్లీ తెలిపారు. ఇకపై తనిఖీలు నిత్యం ఉంటాయని, వినియోగదారులను మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుం టామన్నారు. ఈ ఘటన విషయం బహిర్గతం కావడంతో అప్పటి వరకు కొనుగోలు చేసిన ఆభరణాల పరిస్థితిపై వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.



షాపు యజమానితో మాట్లాడుతున్న వేమూరు సీఐ రామాంజనేయులు

చీటింగ్ కేసులో హైడ్రామా

- పోలీసులపై తిరగబడిన బంగారు వ్యాపారులు
- పోలీసులకు చిక్కిన మణికంఠ సొసైటీ నిర్వాహకుడు

వేమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఇస్తానని ప్రజలను మోసం చేసి పరారైన సొసైటీ యజమాని ఆరు నెలల తర్వాత పోలీసులకు చిక్కాడు. అతడు మోసాల్ని అంగీకరించగా వాటి ఆధా రంగా పోలీసులు బంగారం రికవరీకి సిద్ధమవగా హైడ్రామా నెలకొంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. తెనాలికి చెందిన కొల్లూరు ఉదయవెంకటేశ్వరరావు అనే వ్యాపారి చావలి గ్రామంలో మణికంఠ కో-ఆపరేటివ్ సొసైటీ అనే సంస్థ ఏర్పాటు చేసి బంగారం తా కట్టు రుణాలతో పాటు ఆర్‌డీలు చేయించుకున్నాడు. దాదాపుగా రూ.15 కోట్లతో పరారవగా బాధితులు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సోమవారం అతడ్ని అదు పులోకి తీసుకుని సీఐ రామాంజనేయులు విచారించారు. అతడు చెప్పిన వివరాల మేరకు నిందితుడితో కలిసి సోమవారం రాత్రి తెనాలిలో బంగారం రికవరీకి పోలీసులు వెళ్లగా దుకాణ యజమానులు కొందరు దాడికి ప్రయత్నించారు. పోలీసులను అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో జితేంద్రతో పాటు గొడవకు దిగిన మరో మహిళను పోలీసులు తెనాలి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మార్వాడీలు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. చట్ట ప్రకారంగా కేసు పరిశీలించి బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

సన్నద్ధత.. ఉత్తదే

- బ్యాంకు గ్యారెంటీలపై గందరగోళం
- ఆర్ఎస్‌కేల్లో కానరాని తేమ యంత్రాలు
- నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- ఇప్పటివరకు 107 టన్నులు మాత్రమే సేకరణ
- అల్పపీడన హెచ్చరికలతో అన్నదాతల్లో వణుకు



(బాపట్ల, అమృతలూరు - ఆంధ్రజ్యోతి)

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఖరీఫ్ సీజన్‌లో రెండు లక్షల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతిస్తున్నట్లు ప్రభుత్వం నెల క్రితమే ప్రకటించింది. సేకరణకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని వారం క్రితమే జిల్లాలో 117 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు అధికారులు ఘనంగా ప్రకటించారు. కానీ కొనుగోళ్లకు సన్నద్ధత ప్రకటనలకే పరిమితమని తేలింది. కొనుగోళ్ల ప్రక్రియలో కీలకమైన ఈ-పంట నమోదు, తేమ శాతం పరికరాలు, మిల్లర్ల బ్యాంకు గ్యారెంటీల వరకు అంతా డొల్లేనని తేలింది. పైగా కొనుగోలు కేంద్రాలు తెరిచాక, తాపీగా బ్యాంకు గ్యారెంటీలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు చెప్పడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉంటే ఓ వారం అటోఇటో రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకు కేంద్రాల వద్ద అమ్ముకునే వారు. కానీ అల్పపీడన హెచ్చరికలతో వర్షాల భయం వెం టాడుతుండగా అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. 117 కేంద్రాలు ప్రారంభించినా బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వకపోవడంతో మ్యాపింగ్ జరగకపోవడంతో ధాన్యం సేకరణ ముందుకు సాగడం లేదు. దాదాపు రెండు వేల టన్నుల ధాన్యం నూర్పిడి జరిగి, అమ్మ కానికి సిద్ధంగా ఉన్నాయి. కానీ మంగళవారం సాయంత్రం వరకు నామమాత్రంగా 25 ఆర్‌ఎస్‌కేల పరిధిలో కేవలం 107 టన్నుల ధాన్యం సేకరణకే యంత్రాంగం పరిమిత మైంది. అమృతలూరు మండల పరిధిలోని 14 రైతు సేవా కేంద్రాలు ఉండగా కేవలం 4 కేంద్రాల్లో మాత్రమే తేమ శాతం యంత్రాలు ఉన్నాయి. కలెక్టర్ కేంద్రాన్ని సందర్శించి ఆదేశాలు ఇచ్చినా ఇంత వరకు కొనుగోలు పక్రియ ప్రారంభం కాలేదు. వర్షాలు పడితే పంట ఎక్కడ దెబ్బతింటుందో అన్న భయంతో రైతులు యంత్రాల ద్వారా కోసి అయిన కాడికి అమ్ముకునేందుకు సిద్ధమయ్యారు. ఇదే అదనుగా దళారులు 75 కిలోల ధాన్యం బస్తాకు రూ.1300 ధర ఇస్తుండటంతో రైతన్న నష్టపోతున్నాడు.

కేవలం రూ.8.36 కోట్లకే బ్యాంకు గ్యారెంటీ

రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు బ్యాంకు గ్యారెంటీగా మిల్లర్ల నుంచి దాదాపు రూ.150 కోట్ల వరకు రావాల్సి ఉంది. కానీ మంగళవారం వరకు 9 మిల్లుల పరిధిలో కేవలం రూ.8.36 కోట్లు మాత్రమే వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో దాదాపు 60 శాతం ఈ రెండు రోజుల్లో వచ్చినవే. అంటే బ్యాంకు గ్యారెంటీలపై ఎలాంటి సన్నద్ధత లేకుండానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి అధికారులు ఇప్పుడు హడావిడి చేస్తున్నట్లు అర్థమవుతుంది.

జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక పత్రం అందజేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, సీఈవో వీర్ల జ్యోతి బసు

గుంటూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్‌లో కా రుణ్య నియామకాల సందడి మొదలైంది. మంగళవారం పలువురికి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సీఈవో వీర్ల జ్యోతి బసు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, ఉద్యోగాల్లో చేరే వాళ్లు సీసీఏ నిబంధనలు తెలుసుకొని పనిచేయాలని అన్నారు. సీఈవో జ్యోతి బసు మాట్లాడుతూ, కష్టపడి పనిచేస్తేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా క్రోసూరు ఎంపీపీ కార్యాలయంలో ఆఫీస్ సబా ర్డినేట్ గా శ్రీనివాస్‌గౌడ్‌ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఈ కార్య క్రమం లో అకౌంట్స్ ఆఫీసర్ సామ్యూల్‌పాల్, ఎ సెక్షన్ ఏవో రాజా రత్నబాబు పాల్గొన్నారు.

నిర్దేశించిన తేదీల్లోగా జీపీఎఫ్ వివరాలివ్వాలి

గుంటూరు (విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్ వివరాలు డీడీవోలు నిర్దేశించిన తేదీలోగా జడ్పీలో అందజేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీడీవోలు 2022 జనవరిలో తమ కార్యాలయంలో పనిచేసిన జడ్పీపీఎఫ్ చందా దారుల పే స్లిప్పులను అట స్టేషన్ చేసి గూగుల్ ఫాంలో అప్లోడ్ చేసి, కవరింగ్ లెటర్ ద్వారా జిల్లా ప్రజా పరిషత్ పీఎఫ్ విభాగంలో అందజేయా లని సూచించారు. పే స్లిప్పులను సొంతగా తయారు చేయరాదని చెప్పారు. నిధి పోర్టల్ నుంచి ఉద్యోగి ద్వారా డౌన్లోడ్ చేసే పే స్లిప్పులనే ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. పే స్లిప్పుల్లో ఉన్న వివరాలను గూగుల్ షీట్లో పొందుపరచాలని సూచించారు. ప్రతి జడ్పీపీఎఫ్ ఉద్యోగి, తన సీఎఫ్ఎంఎస్ నంబర్ ద్వారా నిధి పోర్టల్‌లో జనవరి 2022 పే స్లిప్పులు డౌన్లోడ్ చేసి అప్పటి డీడీవోలకు పంపాలని సూచించారు. నిర్దేశించిన తేదీలోగా ఆయా వివరాలు అందించాలని కోరారు.

నవశక్తి అమ్మవారి దేవాలయంలో చోరీ

- అమ్మవారి బంగారు ఆభరణాలు అపహరణ
- మూడు హుండీలలో నగదు దొంగతనం

పెదకాకాని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని సమీపంలోని నవశక్తి అమ్మవారి దేవాలయంలో చోరీ జరిగింది. పెదకాకాని పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పెదకాకాని సమీపంలోని నవశక్తి అమ్మవారు దేవాలయంలో సోమవారం రాత్రి యథావిధిగా ఆలయానికి ఆలయ పూజారి బాలాజీ శర్మ ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. మంగళవారం ఉదయం ఆయన తిరిగొచ్చి చూసేసరికి ఆలయ ప్రధాన ద్వార తలుపులు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా నవశక్తి అమ్మ వారి మెడలో నల్లపూసల గొలుసు, మంగళ సూత్రాలు, ముక్కుపుడకలు ఇలా మొత్తం 50 గ్రాములు బంగారాన్ని చోరీ చేసినట్లు గుర్తించారు. అలాగే హుండీలోని నగదు అపహరణకు గురైనట్లు తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు. క్లూస్ టీం అధికారులు వేలిముద్రలను సేకరించారు.

పారా వెటర్నరీ చట్టం పై ప్రభుత్వానికి నివేదిక

- వృత్తిపర సమన్వయ సమావేశంలో నిర్ణయం

గుంటూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పశు వైద్య విద్యను భ్రష్టు పట్టించే పారా వెటర్నరీ అండ్ అలైడ్ కౌన్సిల్స్ చట్టం- 2023 పై సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలని నిర్ణయించారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ పీవీ లక్ష్మయ్య అధ్యక్షతన మంగళవారం వివిధ విభాగాలు, సంఘాల ప్రతినిధులతో జరిగిన వృత్తిపర సమన్వయ సమావేశంలో ఈ కీలక నిర్ణయం



సమావేశంలో మాట్లాతున్న కౌన్సిల్ చైర్మన్ పీవీ లక్ష్మయ్య, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు

తీసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ చైర్మన్ పీవీ లక్ష్మయ్య మాట్లాడుతూ, అప్పటి ప్రిన్సిపాల్ సెక్రటరీ మన్మోహన్ సింగ్ ఉద్దేశం ప్రత్యేక కౌన్సిల్ స్థాపన కాదని, విశ్వవిద్యాలయంపై భారాన్ని తగ్గించే విధంగా సిలబస్ తయారీ, కోర్సుల పర్యవేక్షణ, పరీక్షల నిర్వహణ కోసం సహాయక బోర్డ్ మాత్రమే అన్నారు. బోర్డు ఏపీ స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ పరిధిలోనే పనిచేయాలన్నారు. దాని కూర్పులో పశుసంవర్ధక శాఖకు చెందిన అధికారులు, వైస్ చాన్సలర్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్స్ ఉండాలని తెలిపారు. ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలని సమావేశం నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జె.వి.రామ్ మాట్లాడుతూ వెటర్నరీ ప్రొఫెషనల్ సంఘాల నేతలు, వెటర్నరీ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఏ ఈశ్వరరావు, పారా వెటర్నరీ కౌన్సిల్ కార్యదర్శి బేబీ రాణి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సంఘం, పశుసంవర్ధక శాఖ అధికారుల సంఘం, వెటర్నరీ అసిస్టెంట్స్ సంఘం, పారా వెటర్నరీ ప్రతినిధులు, ఇతర సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదం

- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు
- కృష్ణవేణిలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

నరసరావుపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి, క్రమశిక్షణకు దోహదపడతాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఆచార్యా నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీలను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ, క్రీడలలో రాణిస్తే చదువులోను రాణిస్తారని అన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కృష్ణవేణి డిగ్రీ కళాశాల క్రీడలకు ప్రాధాన్యమిచ్చి యూనివర్సిటీ స్థాయిలో క్రీడాకారులను తయారు చేస్తుందన్నారు. ప్రతి ఏడాది యూరివర్సిటీ స్థాయిలో టోర్నమెంట్లు నిర్వహిస్తామన్నారు. జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే, యూనివర్సిటీ పతకాన్ని రెక్టార్ రామినేని శివరామప్రసాదు, కళాశాల పతకాన్ని ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటరావు ఆవిష్కరించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి, సర్వీసు చేసి అరవిందబాబు టోర్నమెంటును ప్రారంభించారు. మొదటి రోజు చెబ్రోలు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీపై విక్టరీ డిగ్రీ కాలేజ్, పీఎన్‌సీ అండ్ కేఆర్ కాలేజీపై బాపట్ల బీఏసీఎస్, ఎస్‌కేఆర్‌బీఆర్‌పై ఏఎన్‌యూ జట్టు, వాగ్దేవి డిగ్రీ కళాశాలపై గుంటూరు టీజేపీఎస్, విద్యా



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే అరవిందబాబు

కేంద్రంపై కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, యూనివర్సిటీ రెక్టార్ రామినేని శివరామప్రసాదు, టోర్నమెంట్ ఆర్గనైజర్ సెక్రటరీ ఈదర ఆదిబాబు, పాతూరి శ్రీనివాసరావు, గిరి శంకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో పారదర్శకత పాటించాలి

- డీసీసీబీ చైర్మన్ మక్కెన

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకు శాఖల్లో రైతులకు రుణాల మంజూరులో పారదర్శకత పాటించాలని మాజీ ఎమ్మెల్యే, చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు సూచించారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్ లో మంగళవారం డీసీసీబీ శాఖల మేనేజర్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మల్లికార్జునరావు ఆయా శాఖల్లో బకాయిలు, డిపాజిట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బ్యాంకులో డిపాజిట్లను పెంచేలా కృషి చేయాలని కోరారు. రైతులకు రుణాల మంజూరులో ఉదారంగా వ్యవహరించాలని సూచించారు. బ కాయిల వసూళ్లలో మరింత దృష్టి సారించాలని అన్నారు. సమా వేశంలో సీఈవో వీవీఎస్ ఫణికుమార్, పలువురు మేనేజర్లు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తదితరులు

పరీక్ష ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించొచ్చు : డీఈవో



డీఈవో చంద్రకళ

నరసరావుపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజులను విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చని పల్నాడు డీఈవో ఎల్.చంద్రకళ మంగళవారం తెలిపారు. ఏదైనా ఏపీ ఆన్‌లైన్ సేవా కేంద్రం లేదా ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా నేరుగా చెల్లించవచ్చని చెప్పారు. ఆలస్య రుసుం లేకుండా డిసెంబరు 1 నుంచి 10వ తేదీ వరకు, రూ 25 ఆలస్య రుసుంతో డిసెంబరు 11 నుంచి 12 వరకు, రూ 50 ఆలస్య రుసుంతో డిసెంబరు 13 నుంచి 15వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పదో తరగతి థియరీ ఒక్కో సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5, పరీక్ష ఫీజు రూ.95తో కలిపి రూ 100 చెల్లించాలన్నారు. ఇంటర్మీడియేట్ థియరీ ఒక్కో సబ్జెక్టుకు రూ.5, రిజిస్ట్రేషన్ ఫీజు, పరీక్ష ఫీజు రూ.145తో కలిపి రూ.150 చెల్లించాలన్నారు. ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ ఒక్కో సబెక్టుకు రూ.5, రిజిస్ట్రేషన్ ఫీజు, పరీక్ష ఫీజు రూ.95తో కలిపి రూ.100 చెల్లించాలన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొంది 2025 ఆగస్టు 31 నాటికి ఎస్ఎస్‌సీ అభ్యర్థులు 14 సంవత్సరాలు, ఇంటర్మీయేట్ అభ్యర్థులు 15 సంవత్సరాలు నిండినవారు మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించటానికి అర్హులన్నారు. గతేడాది పరీక్షకు హాజరై తప్పిన అభ్యర్థులు, హాజరు కాని అభ్యర్థులు అర్హులన్నారు. పరీక్ష రుసుంను ఏపీటీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చన్నారు. డీడీ, చలానా రూపంలోనూ స్వీకరిస్తామని అన్నారు. ఏపీవోఎస్ఎస్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఏపీఓపెన్‌స్కూల్ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్‌లోని పేమెంట్ గేట్‌వే ద్వారా, నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డులతో చెల్లించవచ్చని చెప్పారు. దివ్యాంగులకు పరీక్ష ఫీజు లేదని తెలిపారు. ఒక సబ్జెక్టుకు కట్టిన రుసుం మరొక సబ్జెక్టుకు బదలాయించమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం నియమావళికి భిన్నంగా అభ్యాసకుడు రెండు వేర్వేరు అధ్యయన కేంద్రాలలో అనుచిత ప్రవేశం పొంది, రెండు కేంద్రాలలో పరీక్ష రుసుంను చెల్లిస్తే ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ప్రవేశాలను రద్దు చేస్తామని, చెల్లించిన పరీక్ష రుసుం వాపసు ఇవ్వమని డీఈవో వెల్లడించారు.

బోగస్ బిల్లులపై విచారణ

- సాంఘిక, సంక్షేమశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు (విద్య) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కళాశాల వసతి గృహాల్లో నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టకుండా బోగస్ బిల్లులు పెట్టి నిధులు డ్రా చేసిన వ్యవహారంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టరేట్ నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెల ఆరో తేదీన ఆంధ్రజ్యోతిలో "తినకుండానే కడుపు నిండింది"అనే శీర్షికతో కథనం వెలువడిన విషయం తెలిసిందే. మున్సిపల్ ట్రావెల్స్ బంగ్లా సమీపంలో ఉన్న రెండు కళాశాలల హాస్టల్‌లో ఇద్దరు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు బోగస్ బిల్లులు పెట్టి రూ.45లక్షల నిధులు డ్రా చేశారని, దీనికి సాంఘిక సంక్షేమశాఖలోని ఉన్నతాధికారి ఒకరు సహకారం అందించారని ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా ఏడో తేదీన "సంక్షేమంలో సంక్షోభం" అనే శీర్షికన సాంఘిక సంక్షేమ శాఖలో అక్రమాలపై, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల నిర్లక్ష్యంపై ఆంధ్రజ్యోతిలో మరో కథనం వెలువడింది. ఆయా కథనాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి నివేదిక అందజేయాలని సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ లావణ్య నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందుకు డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారి కె.శ్రీనివాస శిరోమణికి బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


సంక్షేమంలో సంక్షోభం
- విద్యార్థులను పట్టించుకోని అధికారులు
- ఓ విద్యార్థిని అదృశ్యం..
- నెలరోజుల తర్వాత గుర్తింపు

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

ఏఎన్‌యూలో వర్క్‌షాప్ బ్రోచర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న హ్యాండ్సం పవర్ బీఐ వర్క్‌షాప్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఉపకులపతి ఆచార్య కె.గంగాధర రావు, రెక్టార్ శివరామ్ ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ వర్క్‌షాప్ ఈ నెల 26 నుంచి 29 వరకు నాలుగు రోజుల పాటు జరుగుతుందని ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. ఈ వర్క్ షాప్‌నకు గోయింగ్ సొల్యూషన్స్, మైక్రోసాఫ్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎమ్ గోపికృష్ణ డాక్టర్ డి.చంద్రమౌళి, డేటా సైన్స్ సైబర్ సెక్యూరిటీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.చైతన్య సీఎస్‌సీ ఎంఐఎల్ కోఆర్డినేటర్ డాక్టర్ యు.సతీష్ కుమార్, సైన్స్ కళాశాల సీఎస్‌సీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.లావణ్య, స్టాటస్టిక్స్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు, ఎగ్జామ్స్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రామచంద్రన్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బ్రహ్మాజీరావు, మహాత్మ జ్యోతిరావు పూలే చైర్ పర్సన్ త్రిమూర్తి రావు తదితరులు పాల్గొన్నారు.



బోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ గంగాధరరావు, రెక్టార్ శివరాం ప్రసాద్ తదితరులు

12 మంది గంజాయి విక్రేతల అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జగదీష్

మాచర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గురజాలలోని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న 12 మందిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 4 కేజీలు గంజాయిని, 6 హాషిష్ ఆయిల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని వారు తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న చల్లా పెద్ద ఆంజనేయులు, చల్లాదేవి, చల్లా శివనాగరాజు, మాధవి, మంజుల లక్ష్మి, కొమెర రమణ, దేరంగుల శరత్‌ప్రసాద్, వేముల శ్రీనివాసరావు, షేక్ అహ్మద్, వెంకటేశ్వర్లు, గాలేటి వెంకటేశ్వర్లు, గరిగంటల వెంకటేశ్వర్లును అరెస్ట్ చేశామన్నారు. వీరు ఒరిస్సా నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకొస్తున్నారన్నారు. వీరికి అండగా నిలిచి గంజాయి సప్లయి చేసే వారిని కూడా అదుపులోకి తీసుకుంటామన్నరు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

మాచర్ల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని కంభంపాడు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. నాగార్జున సాగర్ కుడి కాలువలో ముళ్ల కంపకు మహిళ మృతదేహం తగిలి ఉండడంతో స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐ సంధ్యారాణి సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మాచర్లప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి వయసు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, సమాచారం తెలిసిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని ఎస్ఐ సంధ్యారాణి కోరారు.

టీడీపీ సీనియర్ నేత చేర్రెడ్డి కృష్ణారెడ్డి మృతి



చేర్రెడ్డి కృష్ణారెడ్డి (ఫైల్‌ఫొటో)

రెంటచింతల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాలకు చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, సీనియర్ టీడీపీ నేత చేర్రెడ్డి కృష్ణారెడ్డి మంగళవారం మృతిచెందారు. కొంత కాలంగా అస్వస్థతతో బాధపడుతున్నారు. కృష్ణారెడ్డి సతీమణి రామలక్ష్మి రెంటచింతల సొసైటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. కృష్ణారెడ్డి మృతి పట్ల గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం మంగళవారం నాటికి 582.60 అడుగులు ఉంది. ఇది 290.51 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4,160 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,586 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 28,046 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పశ్చిమడెల్టాకు 3711 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 3,711 క్యూసెక్కుల నీటిని మంగళవారం విడుదల చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్‌చానల్‌కు 212 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 558 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 57 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 89 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 43.06 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 3,600 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 1600 క్యూసెక్కుల నీరు, లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

నేడు గుంటూరు ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

గుంటూరు (విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఐటీఐ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సాయి వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగ అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరుకావచ్చని వెల్లడించారు. ఇతర వివరాలకు 9866366187 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

పీఎస్‌ల సంక్షేమ సంఘం కార్యదర్శిగా సిరిపురం హరి



యడ్లపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయితీ కార్యదర్శుల (పీఎస్) సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా చిత్తూరు జిల్లా పలమనేరు మండలం సముద్రపల్లె పంచాయితీ కార్యదర్శి సిరిపురం హరి ఎన్నికయ్యారు. మండల కేంద్రమైన యడ్లపాడులో పంచాయితీ కార్యదర్శుల సంక్షేమ సంఘ సమావేశం మంగళవారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిరిపురం హరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన హరి మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి, పంచాయితీ కార్యదర్శుల సంక్షేమానికి కృషిచేస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కె.సాంబశివరావు, టి.మోహనరావు, ఇ.శంకరరావు, షేక్ ఫాతిమాబి, షేక్ రమీజ్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు ఎం.వెంకటకిషోర్, గోపాలకృష్ణ, జి.భాస్కరరావు, వైసంధ్యారాణి, యం.వెంకటేశ్వర్లునాయక్, షేక్ ఖ్వాజా కుతుబుద్దీన్, సీహెచ్‌వీఎస్ ప్రసాద్, డి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.60
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

50,502 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 51,138 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,502 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,315 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	11000	14000
334	10000	17700	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	11500	15800	334	11500	17800
273	----	-----	నెంబరు. 5	11500	16300
341	10500	17500	273	---	----
4884	----	---	341	11500	18000
సూపర్ 10	----	---	4884	12000	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15600	తేజ	11000	15400
షార్క్-1	----	---	బ్యాడిగి	11500	18200
బ్యాడిగి	11000	18000	దేవనూరు డీలక్స్	10500	16800
దేవనూరు డీలక్స్	11000	17000	తాలుకాయలు	5000	8500



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రతినిధులు

జెండర్ ఆధారిత వివక్షకు ముగింపు పలుకుదాం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జెండర్ వివక్షకు వ్యతిరేకంగా జాతీయ స్థాయి ప్రచారంలో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్‌లను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆవిష్కరించారు. స్థానిక విజన్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ జెండర్ ఆధారిత వివక్షకు ముగింపు పలుకుదామన్నారు. మగపిల్లలతో సమానంగా ఆడపిల్లల్ని చదవించాలని సమానదృష్టితో చూడాలని చెప్పారు. తదుపరి మండల సమైక్య కార్యాలయంలో కోశాధికారి కె.జ్యోతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశిదేవి మాట్లాడుతూ ఆడపిల్ల పుట్టిన దగ్గర నుంచి మగపిల్లవాడితో సమానంగా తాము సమానమే అనేవిధంగా పిల్లలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బి.సురేష్, సీసీలు ఎ.రత్నరాజు, ఎస్‌వీ శివరాంప్రసాద్, కె.ప్రకాష్, ఎం.సుమలత, ఎల్‌సి సాంబశివారెడ్డి, మండల సమైక్యప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష లేని నవ సమాజాన్ని నిర్మించాలి : ఎంపీపీ

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : లింగ వివక్ష లేని నవ సమాజాన్ని నిర్మాలించాలని ఎంపీపీ లలితకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడుతూ, ప్రతి కుటుంబంలో స్త్రీ విద్యావంతులుగా ఎదిగితే సమ సమాజం నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ, కుటుంబంలో ఆడ, మగ పిల్లలను తారతమ్యం లేకుండా మంచి నడవడికతో పెంచాలని సూచించారు. అనంతరం కార్యాలయం ఎదుట ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, సమాఖ్య అధ్యక్షురాలు జాలాది ధనలక్ష్మి, సీసీలు హనుమత్ నరేంద్ర, శిరీష, సీఆర్‌పీలు అనురాధ, సరిత పాల్గొన్నారు.

అన్ని రంగాలలో నైపుణ్యం కలిగిన మహిళలు

● డీఆర్‌డీఏ పీడీ లవన్న

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాలలో నైపుణ్యం కలిగియున్నారని డీఆర్‌డీఏ పీడీ లవన్న అన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా సమైక్య కార్యాలయంలో మంగళవారం చేతన్ 4.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా లవన్న మాట్లాడుతూ జెండర్ సమానత్వం కోసం జాతీయ ప్రచారం అనే కార్యక్రమాన్ని ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ చౌహన్ ప్రారంభించారని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్ అథారిటీ సభ్యుడు రవి, డ్వామా ఏపీడీ సింగయ్య, డీపీఎంలు రవి, ఆచారి, సునీత, సుబ్బారావు, రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌డీఏ పీడీ లవన్న తదితరులు

డిజిటల్ ఉపకరణాలతో విద్యను నేర్పించాలి

● జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ ఉపకరణాలు ఉపయోగించి విద్యను అభ్యసింప చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం ఉపాధ్యాయులకు సూచించారు. 14 పీఎమ్‌శ్రీ స్కూల్స్‌కు పిఎఎల్ ల్యాబ్స్‌పై మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సూర్యలంక రోడ్డులోని సరస్వతీ మెమోరియల్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీవో మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను పెంచటానికి డిజిటల్ ఉపకరణాలు దోహదపడుతాయన్నారు. తదుపరి 14 స్కూళ్ళకు 30 ట్యాబ్‌లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ పర్సన్ బి.కిషోర్‌బాబు, పీఎల్ ల్యాబ్స్ డీఎస్‌వో, సమగ్రశిక్ష ఎఎంవో డాక్టర్ బిళ్ళా మోజెస్, సీజీటీఎం శ్రీనివాస్, బి.షమీర్‌చంద్ర, ఎస్.పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం

సీబీజెడ్ చర్చి 125 వసంతాల వేడుకను విజయవంతం చేయాలి

● సంఘ కాపరి ఎం.పవిత్రకుమార్

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణ నడిబొడ్డున 1900 సంవత్సరంలో స్థాపించిన సీబీజెడ్ చర్చి 125 వసంతాల వేడుకలను జయప్రదం చేయాలని సంఘ కాపరి ఎం.పవిత్రకుమార్ కోరారు. చర్చి ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సమాజాన్ని చైతన్య పరిచి ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఎంతగానో సీబీజెడ్ చర్చి దోహదపడిందన్నారు. సంఘ కార్యదర్శి జె.క్రిష్టాఫర్ మాట్లాడుతూ బాపట్లలో మొట్టమొదటి క్రైస్తవ సంఘంగా రూపుదిద్దుకొని ఒక ల్యాండ్‌మార్క్‌గా ఏర్పడటానికి మిషనరీలు, సంఘకాపరులు, పెద్దలు సహకారం ఎంతగానో ఉందన్నారు. ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ జె.ఎస్.హెర్బెర్ట్ మాట్లాడుతూ 1882వ సంవత్సరంలో అమెరికా దేశం నుంచి వచ్చిన బుల్లార్డ్ దంపతులు బడుగు, బలహీనవర్గాల ప్రజలను దగ్గరకు తీసుకొని విద్య, వైద్య, ఆహార, ఆధ్యాత్మిక సౌకర్యాలు కల్పించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. బలహీనవర్గాలకు చేయూతనిచ్చిన వారి ఘనతను వేడుకల ద్వారా తెలియజేయనున్నట్లు తెలిపారు. ఈనెల 30వ తేదీ వేడుకలను ఆర్భాటంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో సీహెచ్ చిట్టిబాబు, ఇస్సాకు, జాన్సన్, ఎం.రత్నకుమార్, జె.రత్నకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీబీజెడ్ చర్చి సంఘ కాపరి ఎం.పవిత్రకుమార్

సీపీఐ వందేళ్ళ పండుగకు ఏర్పాట్లు

బాపట్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : సీపీఐ ఆవిర్భవించి డిసెంబరు 26 నాటికి వందేళ్ళు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శతవసంతాల వేడుకలను ఖమ్మం గడ్డపై నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ తెలిపారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ముఖ్యనాయకులు ఈ కార్యక్రమానికి తరలిరానున్నట్లు తెలిపారు. 5 లక్షల మందితో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌లో పేదలకు ఒరిగిందేమిలేదన్నారు. మెడికల్ కళాశాలను ప్రైవేట్‌కు దారాదత్తం చేయటం అన్యాయమన్నారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు మేకల వెంకాయమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, కోలా వీరాంజనేయులు, పొట్లూరి అంకమ్మరావు, జె.రత్నకుమారి, ఆట్ల పోలిరెడ్డి, మేకల రమణయ్య పాల్గొన్నారు.

పచ్చదనంతో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పచ్చదనం పెంచటం, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించటం ప్రధాన లక్ష్యమని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. పట్టణంలోని 23వవార్డు వివేకానందకాలనీలో ఆధునీకరించిన మున్సిపల్ పార్క్‌ను మంగళవారం రాత్రి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎంపీ ల్యాడ్స్ రూ.5 లక్షలతో అభివృద్ధి చేశారు. ప్రారంభసభకు కమిషనర్ జి.రఘునాధరెడ్డి అధ్యక్షత వహించగా ఎంపీ మాట్లాడుతూ వివేకానందకాలనీలో ఏర్పాటు చేసిన ఈపార్క్ ప్రజల ఆరోగ్యానికి, విశ్రాంతికి, కుటుంబాల ఆనందానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో పట్టణాభివృద్ధికి అవసరమైన ప్రతి పనికి పూర్తిగా సహకరిస్తానన్నారు. బాపట్లను ఒక నమూనా పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ పిల్లలు, మహిళలు, వృద్ధులు ప్రతిదినం ఆరోగ్యంగా ఉండటానికి ఇక్కడ వ్యాయామం చేసుకునే అవకాశం కల్పించటం జరిగిందన్నారు. ప్రజలు పార్క్‌ను శుభ్రంగా అందంగా ఉంచి పచ్చదనాన్ని కాపాడాలని కోరారు. అన్ని పార్క్‌లను సుందరీకరణలో భాగంగా అంచనాలను తయారు చేయాలని కమిషనర్‌కు సూచించారు.

ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, నాటక అకాడమి డైరెక్టర్ మందపాటి ఆంద్రేయ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మెప్మా సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ శ్రీనివాసరావు, నాయకులు వి.ధర్మేంద్రరెడ్డి, అడే వంశీ, శీలం శ్రీనివాసరావు, వివేకానందకాలనీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ ప్రసాద్, కూచిపూడి శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

మెగా పశు వైద్య శిబిరాన్ని రైతులు ఉపయోగించుకోవాలి

● విజయవాడ డైరెక్టరేట్ జాయింట్ డైరెక్టర్ టీవీ సుధాకర్

కర్లపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో నిర్వహిస్తున్న ఉచిత మెగా పశు వైద్య శిబిరం రైతులు ఉపయోగించుకోవాలని విజయవాడ డైరెక్టరేట్ జాయింట్ డైరెక్టర్ టీవీ సుధాకర్ అన్నారు. కర్లపాలెం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్‌మిషన్ ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ, శ్రీసత్యసాయి సేవ సంస్థలు, బాపట్ల జిల్లా గ్రామ సేవల విభాగం సంయుక్తంగా మంగళవారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పశు వైద్యులు డాక్టర్ అన్నారి కిరణ్, తిరుమల తేజ, సాహిత్య, నాగార్జున, రేచల్ దివ్య, శివకుమారి, వనజా లక్ష్మి పాల్గొని గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణ వైద్యపరీక్షలు నిర్వహించారు. విశ్రాంత డాక్టర్ పున్నయ్య శాస్త్రి సమకూర్చిన మందులను అందజేశారు. లేగదూడల అందాల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, కన్సోలేషన్ బహుమతులను రైతులకు అందజేశారు. మామిడి మొక్కలను మంతెన నాగరాజు, బుద్దాం శ్రీరామకృష్ణ కల్చరల్ అసోసియేషన్ వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎహెచ్‌వో బాపట్ల డాక్టర్ వి.వేణుగోపాల్, ఈవో డీఎల్‌డీఏ వై.సుధాకర్, ఏడీవీ శ్రీనివాసరావు, బాపట్ల మండల గ్రామ సేవల విభాగం జిల్లా ఇన్‌చార్జి తుమ్మల శ్రీనివాసరావు, ఇన్‌చార్జి కన్వీనర్ అచ్యుత వెంకన్న, ఇంకొల్లు శ్రీనివాసరావు, పశువైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటే ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు

● మెప్మా పీడీ ఆనందసత్యపాల్

బాపట్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : నైపుణ్యం ఉన్నవారికి ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని మెప్మా పీడీ డి.ఆనందసత్యపాల్ తెలిపారు. స్థానిక ఎస్ఎన్‌పి అగ్రహారంలోని పుచ్చలపల్లి సుందరయ్య సమావేశ మందిరంలో మంగళవారం దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ వి.భగవాన్‌దాసు అధ్యక్షతన ఉద్యోగ, ఉపాధి నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై జిల్లా సదస్సు నిర్వహించారు. సదస్సుకు పీడీ ఆనందసత్యపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఉపాధి అవకాశాలు, సంప్రదాయ రంగాలకు మాత్రమే పరిమితం అయి లేవని, నైపుణ్యాలు పెంచుకుంటే యువత దేశ, విదేశాలలో మంచి ఉపాధి అవకాశాలు పొందగలరని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.సుమదురవాణి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బీఎస్ నారాయణభట్టు, డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ నూతలపాటి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి గైడెన్స్ అవసరం

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మంచి గైడెన్స్ విద్యార్థి భవిష్యత్తును సరైన దిశలో నడిపించే వెలుగుదీపమని లిటిల్ ఏంజెల్స్ స్కూల్ డైరెక్టర్ అభినవ్ తెలిపారు. మండలంలోని నందిరాజుతోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లిటిల్‌ఏంజెల్స్ హైస్కూల్‌ను ఎన్‌సిఈఆర్‌టి, ఎస్‌సిఈఆర్‌టి సభ్యులు డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ శివలక్ష్మి సందర్శించారు. జిల్లా జీసీడీవో చారులత, సమగ్రశిక్ష కోఆర్డినేటర్ డాక్టర్ కెపి వెంకటసుబ్బయ్య, డాక్టర్ ఛాయేంద్రకుమార్, ఉమాదేవి, ప్యారిజాన్‌లు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ శివలక్ష్మి విద్యార్థులతో కౌన్సెలింగ్, గైడెన్స్‌పై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఈ.సెబాస్టియన్, పాఠశాల డైరెక్టర్ అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ నాటక ప్రదర్శన విజయవంతం చేయాలి

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రసరంజని, శ్రీఛత్రపతి శివాజీ స్మారక సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన సూర్యలంకరోడ్డులోని టౌన్‌హాలు కోన కళాక్షేత్రంలో శ్రీ ఛత్రపతి శివాజి మహారాజ్ చారిత్రాత్మక నాటక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 మంది కళాకారులతో అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానంతో భారీ సెట్టింగ్‌లో అద్భుతమైన యుద్ధ సన్నివేశాలతో ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమంలో రసరంజని సాహిత్య సంస్థ అధ్యక్షుడు బూర్గుల సంగమేశ్వరశాస్త్రి, వల్లూరి భావన్నారాయణ, జీవీఎల్ మోహన్‌గౌడ్, నక్కల మురళికృష్ణ, జ్ఞాన సత్య ప్రతాప్, ఎం.సూరిబాబు, జి.దుర్గాప్రసాద్, పి.ఫణికుమార్, వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మినేని శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరనిలోటు

బాపట్ల రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు కొమ్మినేని శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరనిలోటు అని బాపట్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి అన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావు పార్థివదేహానికి మంగళవారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో అప్పికట్ల టీడీపీ సీనియర్ నాయకుడు ఇనగంటి గాంధీ, జమ్ములపాలెం సర్పంచ్ బోయిన వెంకయ్య ఉన్నారు.

ఎమ్మెల్యే వేగేశన సంతాపం

టీడీపీ నాయకుడు కొమ్మినేని శ్రీనివాసరావు ఆకస్మిక మరణం బాధాకరమని, పార్టీకి వారులేని లోటు తీరదని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమం విజయవంతం చేయటానికి కొమ్మినేని శ్రీనివాసరావు ఎంతగానో కృషి చేసేవారని, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబానికి మనోధైర్యం కలిగించాలని ఆభగవంతుడిని ప్రార్థిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సభను నిర్వహించారు. కార్యక్రమానికి వయో వృద్ధుల సంక్షేమశాఖ ఛైర్మన్ గడిపూటి నారాయణస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దివ్యాంగుల సమస్యలను అడిగి తెలుసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళుతానని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ మాట్లాడుతూ దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ పోస్టులు విడుదల చేస్తామన్నారు. ఉపకరణాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భావపురి దివ్యాంగుల సేవాసమితి నాయకులు గోగన ఆదిశేషు, పిట్లె శ్రీనివాసరెడ్డి, కోకి రాజశేఖర్‌రెడ్డి, కంది వెంకటరెడ్డి, గొట్టిపాటి లక్ష్మణ్, కొల్లు మాధవి తదితరులు పాల్గొన్నారు.

సమైక్యతకు నాంది పలికిన సర్ధార్ వల్లభాయ్‌పటేల్

● బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

నగరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమైక్యతకు సర్దార్ వల్లభాయ్‌పటేల్ నాందిపలికారని లోకసభ ప్యానెల్ స్పీకర్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. భారత ప్రభుత్వం యువజనవ్యవహారాలు, క్రీడామంత్రిత్వశాఖ మైభారత్‌గుంటూరు, శ్రీవెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని శ్రీ వెలగపూడిరామకృష్ణ స్మారక కళాశాలలో సర్థార్ 150వ ఐక్యత జిల్లా స్థాయి పాదయాత్ర విజయవంతం గా నిర్వహించారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఉక్కుమనిషిగా చరిత్రకెక్కిన సర్దార్‌వల్లభాయ్‌పటేల్ సాహసోపేతమైన నిర్ణయాలే దేశాన్ని ఐక్యం చేశాయన్నారు. ఎస్‌వీఆర్‌ఎం కాలేజ్ కరస్పాండెంట్ ఎన్‌వీకే ప్రసాద్ మాట్లాడుతూ సర్ధార్‌పటేల్ ఆధునిక భారతదేశానికి పునాదులు వేయడానికి అవిశ్రాంతంగా కృషిచేశారని కొనియాడారు. మేరా యువ భారత్ గుంటూరు జిల్లా ఉపసంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ సర్దార్ 150 యూనిటి మార్చ్‌మైభారత్ గుంటూరు కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఆర్‌ఎం కాలేజ్ సెక్రటరీ, కరస్పాండెంట్ బుచ్చయ్యచౌదరి, వైస్ ప్రెసిడెంట్ ఎన్‌వీకే ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, రేపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షుడు మత్తి భాస్కరరావు, నగరం తహసీల్దార్ జీ.నాంచారయ్య, డీఈవో పి.అనంత్‌కశ్యప్, వీఆర్‌వో జీ.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్ చెక్ పవర్‌ను జిల్లా పంచాయతీ అధికారి రద్దు చేసినట్లు డిప్యూటీ ఎంపీడీవో విజయబాబు మంగళవారం తెలిపారు. భట్టిప్రోలు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై జరిగిన విచారణలో సర్పంచ్ దారా రవికిరణ్మయి రూ.60 లక్షల 9 వేల 396లు అక్రమ చెల్లింపులు చేయడంతో ప్రజాధనం దుర్వినియోగం అయినట్లు రుజువైనందున సర్పంచ్ చెక్‌పవర్‌ను జిల్లా పంచాయతీ అధికారి కెఎల్ ప్రభాకరరావు ఈనెల 20వ తేదీన రద్దు చేసి ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచ్ చెక్‌పవర్ రద్దుపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా స్పందిస్తూ గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలో జరిగిన అవకతవకలపై అనేక సందర్భాల్లో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి వినతి పత్రాలు అందించడంతో నిధుల దుర్వినియోగంపై విచారణ జరిగిందని, తద్వారా రూ.2 కోట్ల 30 లక్షలు ప్రజా ధనం దుర్వినియోగం జరిగినట్లు విచారణలో వెల్లడైందన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

రేపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందని అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల సమాఖ్య ఈసీ సభ్యులు జెండర్ ఆధారిత పోస్టర్‌లను మంగళవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ లింగ అసమానతలు, హింస వివక్షతపై అవగాహన పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శౌంరిపూర్ణ,సీసీలు, సమాఖ్య సభ్యురాళ్ళు, గ్రామ సంఘ అధ్యక్షులు, వీవోఏలు, టీడీపీ నాయకుడు కొలసాని రాము పాల్గొన్నారు.



జెండర్ ఆధారిత పోస్టర్‌లను విడుదల చేస్తున్న అనగాని శివప్రసాద్ తదితరులు

మహిళలపై హింసను అరికట్టాలి : పద్మ

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల్లో మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని డొమెస్టిక్ వైలెన్స్ లీగల్ కౌన్సిలర్ ఐద్వా రాష్ట్ర నాయకురాలు పద్మ డిమాండ్ చేశారు. భట్టిప్రోలులోని కెఎస్‌కె మహిళ కళాశాలలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి సుభాషిణి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మనోజ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ సునీత, ఐద్వా జిల్లా నాయకురాలు మమత పాల్గొన్నారు.

చెరుకుపల్లి ఎంపీపీ పాఠశాలలో తనిఖీ

చెరుకుపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి ఎంపీపీ హెచ్‌ఈ పాఠశాలను మండల అకాడమిక్ ఫోరమ్ సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు పాఠశాల రికార్డ్స్, పరీక్షా పుస్తకాలు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పాఠశాల నిర్వహణపై ఎంఈవో లాజరు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అకాడమిక్ ఫోరమ్ సభ్యులు మాన్యం వెంకటేశ్వర్లు, తాతా సుబ్బారావు, వై.చెన్నకేశవులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.రాంబాబు, ఉపాధ్యాయులు ఎ.బాలాజీ, సాంబయ్య నాయక్, అరుణకుమారి, ఎస్ఎంసీ ఛైర్మన్ కె.మాధవి పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థికసాయం

చెరుకుపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజవోలు గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన ఈడే ధనశంకర్ కుటుంబానికి టీడీపీ మండల అధ్యక్షులు తాతా ఏడుకొండలు రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద గృహాన్ని మంజూరుచేసే విధంగా కృషి చేస్తామని ఆయన హామీనిచ్చారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కలిసి నడుద్దాం.. రైతన్న ఉన్నతికి తోడ్పడదాం

● ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కలిసి నడుద్దాం - రైతన్న ఉన్నతికి మరింతగా తోడ్పడదాం... ఇది ముఖ్యమంత్రి, రైతుబిడ్డ చంద్రబాబు నాయుడు సందేశం అని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. యడ్లపల్లిలో మంగళవారం జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో రైతాంగాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అనంతరం ఇంటింటికి ప్రచారం జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా భావించేలా చేసి తక్కువ ఖర్చులతో అధిక ఫల సాయాన్ని అందించేలా సాగునీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్, పంటలకు ప్రభుత్వ మద్దతు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో సాగునీటి కాల్వలు, డ్రెయిన్‌ల మరమ్మతులు పట్టించుకోలేదని, దాంతో సాగునీరు అందక కొన్ని చోట్ల పంట ఎండిపోతే కొన్ని చోట్ల అధిక వర్షాలకు ఓదెలపై చేరిన వరద నీరు బయటకు పోయే పరిస్థితులు లేక పంట కుళ్ళిపోయిందన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు అధికారం చేపట్టగానే కాల్వల మరమ్మతులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. దీనితో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొవడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు చర్యలు తీసుకోవడంతో పాటు పంట నగదు వెంటనే అందిస్తుందని ఆనందబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, బాలకోటిరెడ్డి, ఎం.వేణు, వసంతరావు, కుర్రి వెంకటరెడ్డి, వియస్‌కె ప్రసాద్, సుబ్బయ్య, అమ్మిశెట్టి కిషోర్ పాల్గొన్నారు.

రాజోలు గ్రామంలో...

చెరుకుపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రైతన్న మీకోసం కార్యక్రమంపై జిల్లా వ్యవసాయ అధికారి కె.అన్నపూర్ణ మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని రాజోలు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా రైతుల ఇళ్ళకు వెళ్ళి ముఖ్యమంత్రి సందేశం, సాగులో మార్పు కోసం ప్రభుత్వ పంచసూత్రాలైన నీటిభద్రత, డిమాండ్ ఉన్న పంటల సాగు, వ్యవసాయ సాంకేతికతను వాడుట, పండించిన పంటలను ప్రాసెసింగ్ చేయటం, ప్రభుత్వం ద్వారా లభించే పథకాలను వివరించారు. డాటిసెంటర్ కోఆర్డినేటర్ అచ్యుతరాజు మాట్లాడుతూ రబీలో సాగు చేసుకోవాల్సిన అపరాల రకాల గురించి తెలియజేసి రైతులకు కొన్ని రకాల మినీకిట్లను ఇచ్చారు. రేపల్లె ఏడీఏ లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని, పంటకోత అనంతరం రైతులు ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం తేమశాతం, మట్టిరాళ్ళు ఉండేవిధంగా చూసుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎస్ శాస్త్రవేత్త పి.మధువాణి, మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్, వ్యవసాయ విస్తరణ అధికారి కె.ప్రియాంక, వీఏఏ లక్ష్మీదుర్గ, రైతులు పాల్గొన్నారు.

గుడ్డికాయలంక గ్రామంలో...

రేపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ రైతులకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎ.లక్ష్మి అన్నారు. మండలంలోని గుడ్డికాయలంక గ్రామంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం రైతన్న మీకోసం వారోత్సవాల్లో భాగంగా మండల వ్యవసాయశాఖాధికారి ఇంటింటికి వెళ్ళి రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మొబైల్ యాప్‌లో విషయాలను రైతులకు వివరించారు. ఖరీఫ్ ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ కె.అచ్యుత్‌రాజు, డాక్టర్ మధురవాణి, ఏవో మహేష్‌బాబు, ప్రసాద్, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ, రెవెన్యూశాఖాధికారులు

భట్టిప్రోలు, అద్దేపల్లిలో...

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతన్న మీ కోసం కరపత్రాలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా పంపిణీ చేశారు. భట్టిప్రోలు, అద్దేపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులకు రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రైతుల కోసం చేపట్టిన కార్యక్రమాల గురించిన కరపత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. సాయిబాబా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం చేస్తున్న కృషిని వారు వివరించారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సహకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డొక్కు శ్రీనివాసరావు, యడ్ల జయశీలరావు, డొక్కు చినశ్రీనివాస్, సుధీర్, బాబురావు, లోకనాధం పాల్గొన్నారు.

మురళీమోహన్‌కు మంత్రి సత్యప్రసాద్ అభినందన



మురళీమోహన్‌ను అభినందిస్తున్న మంత్రి సత్యప్రసాద్

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గుర్రం మురళీ మోహన్‌ను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అభినందించారు. ప్రజాస్వామ్య విలువలు, విద్యార్థులలో పెంపొందించాలని ఉద్దేశ్యంతో చట్టసభలు ఎలా పని చేస్తాయో విద్యార్థులచే మాక్ అసెంబ్లీకు మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరిస్తున్న ఆయనను రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి అభినందించినట్లు తెలిపారు.

అక్రమ సస్పెన్షన్లను ఎత్తి వేయాలి

రేపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల అక్రమ సస్పెన్షలను ఎత్తి వేయాలని ఎస్‌డబ్ల్యూఎస్ రేపల్లె డిపో కార్యదర్శి ఎన్‌వీ సాగర్ అన్నారు. ఆర్టీసీ డిపో గ్యారేజీ వద్ద ఆర్టీసీ ఉద్యోగుల సస్పెన్షలను నిరసిస్తూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏలూరు డిపోకు సంబంధించి పెట్రోల్ బంక్‌లో జరిగిన అవకతవలకు అసలు దోషులను వదిలి సంబంధం లేని సిబ్బందిపై చేసిన సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగుల కక్షసాధింపుచర్యలను మానుకోవాలని సూచించారు. తక్షణమే ఆర్టీసీ యాజమాన్యం కార్మికుల సస్పెన్షన్‌ను రద్దు చేయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో నాయకులు శివప్రసాద్, సురేష్,రాజబాబు, నాగరాజు, దేవరాజు, సుబ్బారావు, భాస్కరరావు, రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్యం, సారవంతంపై అవగాహన సదస్సు

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నేల ఆరోగ్యం, సారవంతంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల పరిధిలోని కోనేటిపురంలో జిల్లా వ్యవసాయాధికారి అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో సెలైన్ వాటర్ స్కీం శాస్త్రవేత్త మధువాణి మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన నేల ఆవశ్యకతను రైతులకు వివరించారు. ఆర్గానిక్ ఎరువులు వినియోగంతో నేల సారవంతం అవుతుందన్నారు. ఏడీఏ లక్ష్మి మాట్లాడుతూ, రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన రైతన్న మీ కోసం కార్యక్రమం గురించి వివరించారు. ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ అచ్యుతరాజు, మండల వ్యవసాయాధికారి బ్రహ్మారెడ్డి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

హైడ్రోఫోనిక్స్ సాగుతో అధిక పోషకాలు

● వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డిడి.స్మిత్



ప్రసంగిస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): మట్టి లేకుండా హైడ్రోఫోనిక్స్ సాగు ద్వారా అధిక పోషకాలు పొందవచ్చని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్‌డీన్ డాక్టర్ డిడి.స్మిత్ తెలిపారు. కళాశాలలో మంగళవారం హైడ్రోఫోనిక్స్ సాంకేతిక సాగు, పరికరాల వినియోగంపై శిక్షణా కార్యక్రమం జరిగింది. మట్టి లేకుండా కేవలం నీటితో పంటలు పండించే విధానాలైన హైడ్రోఫోనిక్స్, ఏరోఫోనిక్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిడి.స్మిత్ మా ట్లాడుతూ నీరు, ఎరువులు, పురుగుమందులు తక్కువగా వాడి పోషకాలు అధికంగా ఉండే ఆహారం పొందవచ్చన్నారు. ఇంటి ఆవరణలో చిన్న హైడ్రోఫోనిక్స్ స్ట్రక్చర్ ఏర్పాటు చేసి మొక్కలు పెంచవచ్చని తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో మాత్రమే ఉన్న ఈ ఆధునిక టెక్నాలజి గురించి రైతులు తెలుసుకుని లబ్ధి పొందాలన్నారు. నీరు-నేల విభాగాధిపతి డాక్టర్ జి.రవిబాబు మాట్లాడుతూ హైడ్రోఫోనిక్స్‌లో ఆకుకూరలు, ఔషధమొక్కలు, కూరగాయలకు ఉపయోగించవచ్చన్నారు. ఈ పద్ధతి ద్వారా ఇంటి బాల్కని, పెరటితోట, మిద్దెపైన, పాలీహౌస్‌లో కూడా పంటలు పండించవచ్చని తెలిపారు. హైడ్రోఫోనిక్స్ పరికరాలు, పంటలు పండించే విధానం, అనువైన పంటలు, మెలకువల గురించి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కృపావతి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.వి.ఎస్.రామిరెడ్డి, డాక్టర్.బి.శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ ఎస్.విష్ణువర్ధన్, ఎం.కారుణ్య, ఏవో పద్మతులసి పాల్గొన్నారు.

నేటి నుంచి 20 బోగీలతో వందేభారత్ రాకపోకలు

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వారంలో మంగళవారం మినహా అన్ని రోజుల్లో గుంటూరు మీదుగా రాకపోకలు సాగించే సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ బుధవారం నుంచి 20 బోగీలతో ప్రయాణించనుంది. ఇప్పటి వరకు ఈ రైలు 14 చైర్‌కార్, రెండు ఎగ్జిక్యూటివ్ క్లాస్ బోగీలతో ప్రయాణిస్తోంది. అయితే ప్రయాణికుల నుంచి లభిస్తోన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని రైల్వే శాఖ 20 బోగీలకు అప్‌గ్రేడ్ చేసింది. దీంతో ఇకపై 18 ఏసీ చైర్‌కార్, రెండు ఎగ్జిక్యూటివ్ క్లాస్ బోగీలతో రాకపోకలు సాగించనుంది. దీని వల్ల 312 ఏసీ చైర్‌కార్ సీట్లు అదనంగా ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయి.

కామేశ్వరరావుకు భారతజ్యోతి పురస్కారం

రేపు ప్రదానం చేయనున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



తెనాలి అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాలు సంక్షేమమే ధ్యేయంగా జీవితాంతం సేవలు అందించిన డాక్టర్ పెమ్మరాజు దుర్గాకామేశ్వరరావుకు తెనాలి ప్రచురణలు సంస్థ, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సంయుక్తంగా గురువారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా భారతజ్యోతి పురస్కారం అందించనున్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించనున్న సభలో శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, హైకోర్టు న్యాయవాది ఇంద్రనీల్‌బాబు పాల్గొంటారు. విజయవాడలో 1940లో జన్మించిన కామేశ్వరరావు భౌతిక విజ్ఞాన శాస్త్రంలో పోస్టు గ్రాడ్యుయేషన్, ప్రఖ్యాతిగాంచిన సహా ఇనిస్టిట్యూట్‌లో న్యూక్లియర్ ఫిజిక్స్ అభ్యసించారు. అమెరికాలోని బోస్టన్ యూనివర్శిటీలో బోధకునిగా పని చేసి, న్యూజెర్సీ రట్గెర్స్ యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేశారు. అక్కడ నల్లజాతీయుల హక్కుల కోసం ఉద్యమబాట పట్టిన ఆయనకు స్వదేశంలో బలహీన వర్గాల ప్రజలు పడుతున్న బాధలు గుర్తొచ్చాయి. జన్మభూమికి తిరిగి వచ్చిన ఆయన అప్పటి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ మోహన్‌కందా సలహాతో, విజయనగరం జిల్లాలోని గరివిడి, చీపురుపల్లి మండలాలను ఎంచుకున్నారు. ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్న బలహీన వర్గాల సంక్షేమం లక్ష్యంగా వారి కోసం నిరంతరం సేవ చేశారు. బడుగులు చదువు లేక మోసపోతున్నారని గ్రహించి వయోజన విద్యను చేపట్టి అక్షరాస్యులను చేశారు. ఆయన బడిలో ఎలాంటి పుస్తకాలు, హోమ్ వర్క్‌లు లేకుండా ఆటపాటలతో పాటలు నేర్పారు. ఆయన స్థాపించిన బాలబడి ఒడిస్సా రాష్ట్రంలో కూడా విస్తరించింది. పొదుపు సంఘాలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఆయన ఆలోచన నుంచి అమలులోకి వచ్చినవే. రజకులు, క్షురకుల నివాసం కోసం కృషి చేసి వారి ఇళ్లకు విజయకాలనీ పేరు పెట్టి సంఘ సేవకుడు వావిలాల గోపాలకృష్ణయ్య చేత ప్రారంభించారు. ఆయన సేవలు తెలిసిన అప్పటి ఐఏఎస్ ఐఆర్ శంకరన్ కూడా సహకారం అందించి ఎక్కడా ఎలాంటి ప్రతిబంధకాలు ఎదురు కాకుండా చూశారు. పురస్కార సభకు డబుల్ హార్స్ సంస్థ ఎండి మునగాల మోహన్‌శ్యాంప్రసాద్, కుమార్ పంప్స్ ఎండి కొత్త సుబ్రహ్మణ్యంలు చేయూత అందించారని క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. కామేశ్వరరావు సేవల డాక్యుమెంటరీ వీడియో, పరిచయ సంచికను సభలో ఆవిష్కరించనున్నట్లు చెప్పారు.

క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు

● అంతర్జాతీయ క్రీడాకారుడు భరత్ మహిపతి



వినుకొండటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ఆసక్తి కనబరిచిన విద్యార్థులకు ఎన్‌డీఏ ప్రభుత్వంలో బంగారు భవిష్యత్తు ఉంటుందని అంతర్జాతీయ క్రీడాకారుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు భరత్ మహిపతి అన్నారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని లయోలా పాఠశాల నందు 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ స్టేట్ మీట్ అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారులతో వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా ముచ్చటించారు. నెల్లూరు జిల్లాలోని గోనపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న ఆయన త్వరలో సౌత్ కొరియాలో జరగనున్న హేమర్త్రో పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో 15, జాతీయ స్థాయిలో 40 పతకాలు సాధించానని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 3 శాతం క్రీడల్లో రిజర్వేషన్ కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో క్రీడలకు ప్రాధాన్యం లేక పోవడంతో సుమారు 1,500మంది విద్యార్థులు పీఈటీ కోర్సులు పూర్తి చేసి నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. లోకేశ్ చొరవతో ఇటీవల జరిగిన డీఎస్సీ పోలీస్ ఖాళీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉద్యోగాలు పొందారన్నారు. ఇటీవల ప్రతి పాఠశాలకు సుమారు 67 క్రీడా సామగ్రి కిట్లను పంపిణీ చేయడంతో విద్యా ర్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని మెరుగు పరిచేందుకు.. అవకాశం కలుగుతుందన్నారు. ఒలింపిక్స్‌లో పతకం సాధిస్తే రూ.5కోట్లు నగదు, ప్రభుత్వ భూమితో పాటు నివాస స్థలాన్ని ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం శుభపరిణామని పేర్కొన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు స్పాన్సర్ ఎంతో అవసరం ఉందని, దీంతో క్రీడల్లో అద్భుత ఫలితాలు సాధిస్తారన్నారు.

స్తంభాలు ఉన్నా రోడ్డేశారు



● అడ్డంగా ఉన్న స్తంభాలను తొలగించకుండా రోడ్డు వేస్తున్న దృశ్యం



స్తంభం ఉన్నచోట ఖాళీ వదిలేసి ఇలా రోడ్డు వేస్తున్నారు..



రోడ్డు వేస్తున్నప్పుడు మధ్యలో స్తంభాలు ఉంటే వాటిని తొలగించాలి. కానీ ఇది అందరూ చేస్తారు. కానీ గుంటూరు నగర పాలక సంస్థ అధికారులు అందుకు విరుద్ధంగా చేశారు. రోడ్డు వేయమన్నారు.. వేశాం.. అన్నట్లుగా పనులు పూర్తి చేశారు. సిమెంట్ రోడ్డు వేస్తున్నారని తెలిసినా స్తంభాలు తొలగించకపోవడం విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కాగా.. స్తంభాలు ఉన్నా కూడా సిమెంట్ రోడ్డు వేస్తూ పోవడం కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యానికి మరో నిదర్శనం. స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి రెడ్డిపాలెం వరకు వేస్తున్న సిమెంట్ రోడ్డులో ఇటువంటి ఈ పరిస్థితి నెలకొంది. రోడ్డు మధ్యలో స్తంభాలు ఉన్నా వాటిని తొలగించకుండానే నగర పాలక సంస్థ అధికారులు సిమెంట్ రోడ్డు వేయడం ప్రజల్ని విస్మయానికి గురిచేస్తుంది.

-గుంటూరు
-ఆంధ్రజ్యోతి

ప్రకృతి సాగులో దిట్ట

● రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న నాగేశ్వరరావు



పంట గురించి కలెక్టర్ కృతికా శుక్లాకు తెలియజేస్తున్న రైతు నాగేశ్వరరావు

నాగిరెడ్డిపాలెం (బెల్లంకొండ), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రసాయనాలు లేని ఉత్పత్తులు అందిస్తూ, ప్రకృతి సాగువైపు రైతులను చైతన్య పరుస్తున్నారు రైతు కొత్తపల్లి నాగేశ్వరరావు. బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించడంలో ఆయన విజయం సాధించారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఒకే పొలంలో కూరగాయలు, ఆకుకూరలు, మిల్లెట్స్, పూల సాగు సాగు చేస్తూ ఏడాది పొడవునా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఆవు ఆధారిత జీవామృతం, ఘనజీవామృతం, నేమస్త్రంను స్వయంగా తయారు చేసుకుంటూ వాటిని పంటలకు వినియోగిస్తూ మంచి దిగుబడులను సాధిస్తున్నారు. ఆయన పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి గిరాకి ఉండటం గమనార్హం. ఢిల్లీ, పుణె, హైదరాబాద్ ప్రాంతాలను నుంచి పరిశోధకులు, రైతులు బృందాలు వచ్చి నాగేశ్వరరావు చేపట్టిన ప్రకృతి సాగు క్షేత్రాన్ని సందర్శిస్తూ సాగులో మెళకువలను తెలుసుకుంటున్నారు. ఆయన సూచనలతో ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లడం ఆయన సాధించిన విజయంగా అధికారులు పేర్కొంటున్నారు. ప్రకృతి వ్యవసాయంలో నాగేశ్వరరావు రైతులకు ప్రేరణ ఇవ్వడంతో పాటు వారికి ఆదర్శంగా నిలుస్తున్నారని కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు.

● ప్రకృతి ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ

ప్రకృతి విధానంలో సాగు చేసిన ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రత్యేకంగా మార్కెట్‌లో విక్రయిస్తుండటమే ఇందుకు నిదర్శనం. ఈ ఉత్పత్తులకు మంచి ధర కూడా మార్కెట్‌లో లభిస్తుండటం ఈ సాగును ప్రోత్సహించేదిగా ఉంది. 2016లో నేను ప్రారంభించిన ప్రకృతి వ్యవసాయం నా జీవితాన్నే మార్చేసింది. మా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం నాకు పెద్ద బలం. ఇకపై మరిన్ని విజయాలు సాధించాలని లక్ష్యంగా పని చేస్తున్నాను.

- రైతు నాగేశ్వరరావు





రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అనంతపురం, గుంటూరు జట్లకు కప్‌లు అందజేస్తున్న జంగా కృష్ణమూర్తి

ఎన్డీయే ప్రభుత్వంలో క్రీడలకు ప్రాధాన్యం : జంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బాలికల విభాగంలో అనంతపురం, బాలుర విభాగంలో గుంటూరు జిల్లా ఫస్ట్

వినుకొండటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వినుకొండ లయోలా పాఠశాలలో జరుగుతున్న 69వ అండర్ -17 బాలబాలికల అంతర జిల్లాల అథ్లెటిక్స్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం 18 విభాగాల్లో పోటీలు నిర్వహించగా ఓవలాల్ ఛాంపియన్ షిప్ బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు, బాలుర విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు విజయం సాధించాయి. ఇదిలా ఉండగా అథ్లెటిక్స్‌లో మొత్తం 7 విభాగాల్లో పోటీలు నిర్వహించగా గుంటూరు జిల్లా విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు.

ముగింపు కార్యక్రమానికి టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో మంత్రి నారా లోకేశ్ చొరవతో క్రీడాకారులకు విద్య, ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్ కల్పించారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని విజయం వైపు పయనించాలన్నారు. కార్యక్రమంలో పోటీల పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి, లగడపాటి వెంకట్రావు, డీసీ గంగినేని రాఘవ, జనసేన పార్టీ నాయకుడు నిశ్శంకర శ్రీనివా సరావు, ఫాదర్ అవినాష్, సిస్టర్ సిస్లీ, రాణితో పాటు పీఈటీ నాయ కులు శివశంకర్, చిరంజీవి, రాజేష్, కొండలు, అనంతపురం ఛాంపి యన్ షిప్ మేనేజర్ ఓబులేసు, కోచ్ నారాయణ పాల్గొన్నారు.

ఏపీ సీఆర్‌డీఏపై.. ఆసక్తి

● రెవెన్యూ ఉద్యోగుల డిప్యూటేషన్‌కు తెరిచిన తలుపులు
● ఇక్కడి కంటే 30 శాతం అదనపు జీతభత్యాలు
● విజ్ఞాపన లేఖలు పెట్టుకుంటోన్న సిబ్బంది

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆకర్షణీయమైన జీతభత్యాలు... వారంలో ఐదు రోజుల పనిదినాలు... ఎనిమిది గంటల పని వేళలతో రెవెన్యూ సర్వీసెస్ ఉద్యోగులకు ఏపీ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీసీఆర్‌డీఏ) ఆహ్వానం పలుకుతోన్నది. ప్రస్తుతం జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల్లో పని చేస్తూ పొందుతోన్న జీతం కంటే 30 శాతం అదనంగా శాలరీ వస్తుంది. దీంతో చాలామంది ఉద్యోగులు సీఆర్‌డీఏకి ఫారెన్ సర్వీసు కింద డిప్యూటేషన్‌పై వెళ్లేందుకు ప్లాన్ చేసుకొంటున్నారు. ఇప్పటికే కొంతమంది విజ్ఞాపన లేఖలు పెట్టుకొని ఇక్కడి నుంచి రిలీవింగ్ అయి రాజధానిలో నూతనంగా నిర్మించిన సీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లి జాయినింగ్ అయ్యారు. త్వరలో మరి కొంతమంది కూడా డిప్యూటేషన్‌పై వెళ్లేందుకు సంసిద్ధమౌతోన్నారు.

ఏపీసీఆర్‌డీఏలో భూ విభాగం ఉన్నది. అలానే తుళ్లూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ యూనిట్లు ఉన్నాయి. మరో వైపు సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో అడ్మిన్ సెక్షన్ ఏర్పాటైంది. వీటన్నింటిలో డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులకు దాదాపుగా 30 వరకు పోస్టుల ఖాళీలున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ల్యాండ్ పూలింగ్ యూనిట్లు దాదాపుగా ఖాళీ అయ్యాయి. అప్పటివరకు ఆయా కార్యాలయాల్లో విధులు నిర్వహించిన అధికారులంతా వేరే జిల్లాలకు వెళ్లిపోయారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సీఆర్‌డీఏలో కార్యకలాపాలు జోరందుకొన్న తర్వాత మళ్లీ ఫారెన్ సర్వీసు కింద డిప్యూటేషన్‌పై వచ్చేందుకు రెవెన్యూలోని వివిధ హోదాలు కలిగిన అధికారులు ఆసక్తి చూపుతున్నారు.

ఇటీవల గ్రామ/వార్డు సచివాలయాల్లో రీ వ్యాపింగ్ జరిగినప్పుడు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన కార్యదర్శులను సీఆర్‌డీఏ డిప్యూటేషన్‌పై తీసుకొన్నది. అలానే సర్వే విభాగం నుంచి కూడా కొందరిని నియమించుకొని పోస్టింగ్‌లు ఇచ్చింది. ఇప్పుడు రెవెన్యూ నుంచి ప్రధానంగా డీటీ, తహసీల్దార్, డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన అధికారులను ఆహ్వానిస్తోన్నది. లేఅవుట్ల అభివృద్ధి పనులు, రోడ్లు, నిర్మాణ రంగం ఊపందుకోవడం, మిగిలిపోయిన భూముల సేకరణ తదితర పనుల కోసం రెవెన్యూ అధికారుల అవసరం ఏర్పడింది. దీంతో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్ చేయాలని విజ్ఞాపనలు సీసీఎల్‌ఏకి వెళ్లాయి. ఈ నేపథ్యంలో సీఆర్‌డీఏకి వెళ్లదలచిన అధికారులు కలెక్టర్లకు లేఖలు పెట్టుకొంటున్నారు. అక్కడి నుంచి ఫైలు సీసీఎల్‌ఏకి వెళ్లి ఆమోదం పొందిన తర్వాత ఇక్కడ రిలీవింగ్ అయి సీఆర్‌డీఏలో చేరాల్సి ఉన్నది. సీఆర్‌డీఏ ఆఫీసులో కార్పొరేట్ కార్యాలయాల తరహాలో క్యాబిన్‌లు, వాతావరణం ఉంటుంది. దీంతో రెవెన్యూ ఉద్యోగులు అక్కడికి వెళ్లి పని చేసేందుకు ఆసక్తి కనబరుస్తోన్నారు.

పీఏసీఎస్‌ల అక్రమాల బాధ్యులపై చర్యలకు ప్రతిపాదనలు

గుంటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మంగళగిరి, కురగల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో అక్రమాలు ప్రాథమిక విచారణలో తేలినట్లు జిల్లా సహకార అధికారి వీరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో మంగళవారం ప్రచురితమైన రైతుల సొమ్ము స్వాహా' పేరుతో వచ్చిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. మంగళగిరి, కురగల్లు పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై విచారణ చేయటంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం 1964లోని సెక్షన్ 51 కింద విచారణ ఉత్తర్వులు అనుమతి కోసం కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ , కమిషనర్‌లకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అలానే కురగల్లు పీఏసీఎస్‌లో 75 మంది డిపాజిట్‌లకు సంబంధించి రూ 8.50 కోట్లు , మంగళగిరి పీఏసీఎస్‌లో ఆరుగురి డిపాజిట్‌లకు రూ. కోటి 25 లక్షలు అవకతవకలు జరిగినట్లు విచారణలో తేలినట్లు ప్రకటనలో వివరించారు. అయితే ఈ డిపాజిట్ల వివరాలు సంఘ ఆర్థిక లావాదేవీల పరిధిలోకి రానట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు పేర్కొన్నారు.

పొగమంచు.. గమనించు



● జాతీయ రహదారులపై అధికంగా ప్రమాదాలు
● పరిమిత వేగం.. అధికారుల సూత్రం

గుంటూరు(తూర్పు), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శీతాకాలం ప్రారంభమైంది. జనవరి ఉష్ణోగ్రతల గణాంకాలు.. ఈ ఏడాది నవంబరులోనే నమోదవుతున్నాయి. రహదారులను పూర్తిగా పొగమంచు కప్పేస్తోంది. ఉదయం 8 గంటలైనా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ సమయంలోనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉంటుంది. డ్రైవర్లు అప్రమత్తంగా లేకపోతే విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. రాష్ట్ర రోడ్డు భద్రతా విభాగం సైతం నవంబర్ - ఫిబ్రవరి మధ్య పొగమంచు కారణంగా ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు ఇటీవల వెల్లడించింది. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు సూచనలిస్తున్నారు. ముఖ్యంగా ప్రయాణం కలిసోస్తుందన్న.. కారణంగా వేకువ జామున 2 నుంచి ఉదయం 7 గంటల మధ్యలో.. వేగంగా వాహనాలను నడుపుతుంటారు. ఈ సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని.. కుదిరితే వాహనదారులు ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని కోరుతున్నారు.

జాతీయ రహదారిలో గతేడాది నవంబరు - ఫిబ్రవరి మధ్య ఉమ్మడి గుంటూరు జిల్లాలో వేకువ జామున జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో 18 మంది చనిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

వాహనాల నుంచి వెలుపడే పొగ కారణంగా మంచు మరింత దట్టంగా మారుతోంది. రహదారి ఐదారు మీటర్ల దూరం వరకు కనిపించని పరిస్థితి. దుమ్మూధూళి రేణువులపై గాలిలోని తేమ సాంద్రీకరణ చెంది.. పేరుకుపోయి అత్యధికంగా కనిపిస్తుంది. క్రషర్లు, పరిశ్రమలు, రైస్ మిల్లులు ఉన్న ప్రాంతాలతో పాటు ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల పరిసర ప్రాంతాలు మసకబారుతాయి. ఈ క్రమంలో

వేగం, నిద్రమత్తు వీడాలి

రాత్రిళ్లు వాహనాలను మితిమీరిన వేగంతో నడపడం, ఉదయం డ్రైవర్ల నిద్రమత్తు ప్రమాదాలకు కారణాలు.

జాతీయ రహదారిలో జిల్లా వెంబడి దాదాపు 25పైగా బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, సీసీ కెమెరాలు, శక్తివంతమైన లైటింగ్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

వేగ నియంత్రణ పాటిస్తూ.. వాహనదారులు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తే ప్రమాదాలు జరగకుండా నియంత్రించే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పొగమంచులో.. డ్రైవింగ్ చేసేప్పుడు వాహనాల హెడ్‌లైట్లు, ఇండికేటర్లు, బ్రేక్ లైట్లు వేసుకోవాలి. స్పీడు కాదు ప్రాణాలే ముఖ్యమని ప్రతి వాహనదారుడు గుర్తించాలని సూచిస్తున్నారు.

డ్రైవింగ్‌లో నిద్ర వస్తే వాహనాన్ని ఆపి, కాస్త కునుకు తీస్తే సరిపోతుంది. టీ, గోరువెచ్చిన నీరు తాగి ముఖాన్ని శుభ్రంగా నీటితో కడుక్కోవాలి. కాసేపు ఇతరులతో మాట్లాడి నిద్ర మత్తును దూరం చేసుకోవాలి. టోల్ ప్లాజాల సమీపంలో ఉన్న విశ్రాంత గదులను డ్రైవర్లు వినియోగించుకోవాలి. జాతీయ రహదారి వెంబడి రోడ్డు సేఫ్టీ సిబ్బంది చేపట్టిన డ్రైవర్లకు ముఖం కడిగే కార్యక్రమంలో భాగం కావాలి.

గస్తీ పెంచుతున్నాం

శీతాకాలంలో రాత్రిళ్లు రహదారుల వెంబడి గస్తీ పెంచుతున్నాం. రోడ్ సేఫ్టీ సిబ్బందితో డ్రైవర్ల ముఖం శుభ్రం చేయిస్తున్నాం. తక్కెళ్లపాడు, మానససరోవరం వద్ద ఉన్న స్పీడ్ గన్‌లను అందుబాటులోకి తీసు కొస్తున్నాం. డీజీపీ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసి, ప్రమాదాలను నివారిస్తాం.

- కె.సీతారామిరెడ్డి, డీటీసీ, గుంటూరు

ఇవి పాటిద్దాం..

- మంచు తగ్గిన తరువాతే ప్రయాణించాలి.
- మరో డ్రైవరును ఉంచుకోవాలి.
- డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనం ఇవ్వొద్దు
- ఇంజిన్, టైర్లు కండిషన్‌లో ఉంచుకోవాలి
- ముందు అద్దాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి.
- సర్వీస్ రోడ్లలో వేగాన్ని పూర్తిగా నియంత్రించాలి.
- రాత్రిళ్లు రహదారిపై సరుకు దిగుమతి, ఎగుమతి చేయకూడదు.
- అధికారులు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, ఇతర చిహ్నాలను గమనించాలి.
- జీబ్రా లైన్లను పరిశీలించాలి.
- మలుపుల్లో విధిగా హారన్ మోగించాలి.
- ఫాగ్ ల్యాంప్‌లను ఆన్ చేసుకోవాలి.

మెప్మాలో మరో దారుణం..!

బ్యాంకు రుణాల రిపోర్టులు మాయం..!

బ్యాంకు లింకేజి అధికారి తీరుపైనా అనుమానం

టార్గెట్‌ల కోసం బ్యాంకర్లు బోగస్‌కు సహకారం

ఘోరంగా మోసపోతున్న అమాయక సభ్యులు

అవినీతిపై ఏడుగురితో విచారణ చేపట్టిన పీడీ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మెప్మాలో అవినీతి భాగోతం తవ్వే కొద్దీ బయటపడుతోంది. దీంతో అక్రమార్కులు అడ్డదారులు తొక్కినట్లు తెలిసింది. ఏకంగా రికార్డులనే మాయం చేసే స్థాయికి వ్యవహారం వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. కొద్దిరోజులుగా ఆంధ్రజ్యోతిలో ప్రచురితమవుతున్న కథనాలతో మెప్మా కార్యాలయంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు బోగస్ భాగోతం తేల్చడానికి విచారణ కమిటీలను నియమించారు. ముఖ్యంగా బ్యాంకుల ద్వారా రుణం పొందిన పొదుపు సభ్యుల వివరాలు కార్యాలయంలో పనిచేసే బ్యాంకు లింకేజి అధికారి వద్ద పూర్తి సమాచారం ఉండాలి. ప్రతినెలా బ్యాంకుల నుంచి నివేదికలను తీసుకుని, వాటిని భద్రపరచాలి. ఏ బ్యాంకులో ఎన్ని పొదుపు సంఘాలకు రుణాలు ఇచ్చారు. ఎంతెంత ఇచ్చారో రికార్డు చేయడంతోపాటు, మున్సిపాలిటీల వారీగా నెలవారీ రుణాల మంజూరు జాబితాను తయారుచేయాల్సిన బ్యాంకు లింకేజి అధికారి చుట్టూ వ్యవహారం తిరుగుతోంది. రెండు రోజులుగా జరుగుతున్న విచారణలో బ్యాంకు లింకేజి ఫైళ్లు, రిపోర్టులు అందించాలని కోరగా, ఒక్కటి కూడా లేకుండా మాయం చేయడంపై ఇప్పుడు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 2022 నుంచి నేటి వరకు బోగస్ గ్రూపుల కథ మొదలైనట్లు సమాచారం. అయితే నెలవారీ జాబితా, రిపోర్టులు ప్రస్తుతం కనిపించడం లేదని తేల్చి చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆ ఉద్యోగి ఇచ్చే సమాచారంపైనే వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. కానీ ఆ అధికారి మాత్రం అధికారులు అడిగిన సమాచారం ఇవ్వకుండా విచారణకు అడ్డం తిరిగినట్లు సమాచారం. బోగస్ గ్రూపుల చిట్టా తేలాలంటే ఆ అధికారిని పూర్తిస్థాయిలో విచారిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు వెల్లడిస్తున్నారు.

బ్యాంకర్ల పాత్రపైనా అనుమానం


పట్టణ పొదుపు మహిళల కోసం ప్రభుత్వం అనేక పథకాలను, రుణాలు మంజూరు చేసి, ప్రోత్సహిస్తుంది. దీంతో పేద మహిళలు చిరువ్యాపారాలు చేసుకునేందుకు అవసరమైన రుణాల కోసం బ్యాంకర్లు చుట్టు కాళ్లరిగేలా తిరిగినా కనికరించరు. లక్షా తొంభై ఆంక్షలతో ఇబ్బంది పెట్టే బ్యాంకర్లు తమ పనితీరుకు విరుద్ధంగా బోగస్ గ్రూపులకు కళ్లు మూసుకుని కోట్లు మంజూరుచేయడంపైన అనుమానాలు కలుగుతున్నాయి. రూ.20లక్షల రుణాన్ని ఒక పొదుపు గ్రూపునకు మంజూరు చేయాలంటే వారందరు బ్యాంకు మేనేజరుకు కనిపించాలి. అలాగే మంజూరైన రుణం మొత్తం పొదుపు సభ్యుల బ్యాంకు ఖాతాల్లోకే జమచేయాలి. కానీ ఇక్కడ ఇవేమీ జరగలేదు. దీంతో కోట్లలో జరిగిన అవినీతిపైనా బ్యాంకర్ల పాత్ర ఉన్నట్లుగా తెలుస్తోంది. టార్గెట్‌ల కోసం, కొందరు సిబ్బంది కాసుల కక్కుర్తి కోసం బోగస్ గ్రూపులకు సహకరించినట్లు తెలుస్తోంది. మెప్మాలో జరుగుతున్న బోగస్ అవినీతికి ఫుల్‌స్టాప్ పెట్టాలంటే మొదటగా బ్యాంకుల్లోనే బ్రేక్ పడాల్సిన అవసరం ఉంది. ఇప్పటివరకు కొందరు బ్యాంకర్లు ఆర్పీలకు సహకరించడంతో భారీగా రుణాలు మంజూరయ్యాయి. కానీ అవి పొదుపు సభ్యులకు చేరలేదు. ఆ అవినీతిలో చేతివాటం చూపి ఆర్పీలు కోట్లకు పడగలెత్తారనేది బహిరంగ రహస్యం. పొదుపు సభ్యులను మోసం చేయడంలో బ్యాంకర్లు, ఆర్పీలు, సీవోలు, సీఎంఎంల పాత్ర లేకుండా ఇంతటి అవినీతికి అవకాశం లేదు. అయితే రుణాల మంజూరు చేసిన జాబితాలు కూడా బయటపెట్టకపోవడంతో బ్యాంకర్లపైనా అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆర్‌ఆర్ యాక్ట్ ద్వారా అన్నీ వసూలు చేస్తాం

- పి. శ్రీహరి, మెప్మా పీడి

మెప్మాలో పొదుపు సభ్యులకు జరిగిన అన్యాయంపై ఏడుగురు సభ్యులతో విచారణ మొదలుపెట్టాం. ప్రత్యేకించి బోగస్ గ్రూపుల జాబితా బ్యాంకుల నుంచి తెప్పిస్తున్నాం. మెప్మా కార్యాలయంలోనూ అవినీతి వ్యవహారం జరిగినట్లు తెలుస్తోంది. రుణాలు పొందిన సంఘాల జాబితా ప్రతి నెలా తీసుకుని భద్రపరచాల్సి ఉంది. అయితే ఆ బాధ్యతలు చూసే బ్యాంకు లింకేజి అధికారిని రిపోర్టులు కోరితే నావద్ద లేదని సమాధానం చెబుతున్నారు. 2022 నుంచి రిపోర్టులు లేకపోవడంపైనా అనుమానాలు ఉన్నాయి. అలాగే యానాదుల సామాజికవర్గానికి చెందిన పొదుపు సభ్యులు ఫిర్యాదుతో విచారణ చేశాం. వారి బాధ్యతలు చూసే ఆర్పీ లాగిన్ నిలిపివేయడంతోపాటు, చోటుచేసుకున్న అవినీతిపై మెప్మా ఎండీ కార్యాలయానికి నివేదిక పంపాము. విచారణ పారదర్శకంగా నిర్వహిస్తాం. అవినీతికి పాల్పడిన వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటాము. రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద పతి పైసా తిరిగి కట్టిస్తాం. సహకరించని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. మెప్మాలో జరిగిన అవినీతిపై పూర్తి నివేదికను మెప్మా ఉన్నతాధికారులు, కలెక్టర్, ప్రజాప్రతినిధులకు అందజేస్తాం.

కల సాకారం!



అద్దంకి పట్టణం

నాలుగు నియోజకవర్గాలు రెండు రెవెన్యూ డివిజన్లు

మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా

పశ్చిమప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రకాశంలోకి తిరిగి అద్దంకి,కందుకూరు

కొత్తగా అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్

అందులోకి దర్శి నియోజకవర్గం

మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు సీఎం ఆమోదం

నేడు కేబినెట్ అధికార ముద్రతో లైన్‌క్లియర్

మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా కావాలన్న పశ్చిమప్రాంత ప్రజల కల సాకారమైంది. దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న వారి ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మొత్తం నాలుగు నియోజకవర్గాలతో జిల్లా ఏర్పడనుంది. అందులో రెండు డివిజన్లు ఉండనున్నాయి. ఉమ్మడి జిల్లాను నాటి వైసీపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా చేసిన విభజనతో దొర్లిన తప్పులను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం సరిచేసింది. ఇక అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను తిరిగి ప్రకాశం జిల్లాలోకి రానున్నాయి. అలాగే దర్శి, అద్దంకి నియోజకవర్గాలను కలిపి అద్దంకి డివిజన్ ఏర్పాటు చేయనున్నారు. త్వరలో జరగనున్న మంత్రివర్గ సమావేశం అధికార ముద్ర పడిన వెంటనే ప్రక్రియ మొదలుకానుంది.

ఒంగోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంతంలోని మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాలతో ఈ జిల్లా ఆవిర్భవించనుంది. అందులో మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లు ఉండనుండగా వాటి పరిధిలో 21 మండలాలు ఉండనున్నాయి. అదేసమయంలో గతంలో ఉమ్మడి జిల్లా నుంచి బాపట్ల జిల్లాలోకి వెళ్లిన అద్దంకి, నెల్లూరు జిల్లాలోకి వెళ్లిన కందుకూరు నియోజకవర్గాలు తిరిగి ఒంగోలు కేంద్రంగా ఉన్న ప్రకాశం జిల్లాలోకి చేరనున్నాయి. ఈ పరిధిలో ప్రస్తుతం ఒంగోలు రెవెన్యూ డివిజన్ ఉండగా గతం నుంచి డివిజన్ కేంద్రంగా ఉన్న కందుకూరు డివిజన్ కలవడంతోపాటు కొత్తగా అద్దంకి డివిజన్ ఏర్పాటు కానుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతల సూచనలకు ప్రాధాన్యత ఇస్తూ మంత్రివర్గ ఉపసంఘం ఈ మేరకు సిఫారసు చేయగా విస్తృత కసరత్తు అనంతరం సీఎం చంద్రబాబునాయుడు అందుకు మంగళవారం ఉపసంఘంతో జరిగిన భేటీలో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

అప్పట్లో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం అనంతరం తొలిగా 1970లో ఒంగోలు కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పడిన విషయం విదితమే. అప్పటివరకు గుంటూరులో ఉన్న ఒంగోలు డివిజన్, నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరు డివిజన్, కర్నూలు జిల్లాలో ఉన్న మార్కాపురం డివిజన్‌లను కలిపి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా జిల్లా ఏర్పాటు చేశారు. అనంతరం రెండేళ్లకు జిల్లాకు చెందిన ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు పేరును పెట్టారు. అలా ప్రకాశం జిల్లాగా మార్పు జరిగిన 52 ఏళ్లకు వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజన జరగ్గా అశాస్త్రీయంగా చేశారు. ఒంగోలుకు సుదూరంగా ఉన్న మార్కాపురం ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా చేయాలని ఆ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లగా కోరుతున్నా వారి కోరిక న్యాయమైనా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. పార్లమెంటు స్థానం యూనిట్ పేరుతో పశ్చిమ ప్రాంతం మొత్తాన్ని ప్రకాశం జిల్లాలోనే ఉంచి, ఒంగోలుకు సమీప ప్రాంతామైన కందుకూరు నియోజకవర్గాన్ని సుదూరమైన నెల్లూరు జిల్లాలోకి, అద్దంకి నియోజకవర్గాన్ని ఏరంకంగానూ అనువు లేని బాపట్ల జిల్లాలోకి మార్చారు. ఆ మార్పుపై అన్ని ప్రాంతాల ప్రజల్లోను తీవ్ర నిరసన వ్యక్తమైనా ఆనాటి సీఎం జగన్ ఏ మాత్రం పట్టించుకోకుండా విభజన చేశారు.

ఇచ్చిన మాట ప్రకారమే జిల్లా

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు, కందుకూరు, అద్దంకి యోజకవర్గాలను తిరిగి ఒంగోలు జిల్లాలోకి చేర్చుతానని చంద్రబాబు, యువగళం పాదయాత్ర సమయంలో యువనేత నారా లోకేష్‌లు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ హామీకి కట్టుబడి ప్రస్తుతం పునర్విభజనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అయితే దర్శి నియోజకవర్గాన్ని కూడా తొలుత మార్కాపురం జిల్లాలోకి చేర్చుతారన్న చర్చ సాగినప్పటికీ ఆ ప్రాంత ప్రజల కోరిక మేరకు ప్రకాశంలోనే ఉంచారు. అంతేకాక మంత్రి రవికుమార్ సూచన మేరకు కొత్తగా అద్దంకి డివిజన్ ఏర్పాటు జరగనుండగా, దర్శి నియోజకవర్గం మొత్తాన్ని అద్దంకి డివిజన్‌లోకి చేర్చారు. తద్వారా వారికి డివిజన్ కేంద్రం దగ్గరకానుంది. మరోవైపు మార్కాపురం జిల్లాతో పాటు ఆ ప్రాంతంలో గిద్దలూరు డివిజన్ ఏర్పాటును తొలుత పరిశీలన చేసినా తర్వాత దానిని ఆపేసి కనిగిరి డివిజన్‌లోకి గిద్దలూరు నియోజకవర్గం మొత్తాన్ని చేర్చారు. అలాగే మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాలను మార్కాపురం డివిజన్‌లో ఉంచారు. ఈ మేరకు బుధవారంజరగనున్న కేబినెట్ సమావేశంలో ఆమోద ముద్ర వేయనున్నారు. తాజా పునర్విభజనపై మంత్రి స్వామి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ అన్ని ప్రాంతాల ప్రజల ఆకాంక్ష, ఆ ప్రాంత ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకునే సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం చేశారన్నారు. రెండు ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రణాళికాబద్ధ కార్యాచరణతో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాల మెరుగునకు చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం చంద్రబాబు ఇతర మంత్రివర్గ ఉపసంఘ సభ్యులకు ఈ సందర్భంగా ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్లు

నూరుశాతం రాయితీపై అందించనున్న ప్రభుత్వం

ఈనెల 25 వరకు దరఖాస్తుకు గడువు

30 వరకు పొడిగిస్తూ ప్రభుత్వ నిర్ణయం

జిల్లాకు 80 మందికి అందజేయనున్న ప్రభుత్వం

ఒంగోలునగరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం దివ్యాంగులకు తీపి కబురు చెప్పింది. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉండగా దివ్యాంగులకు ఉచితంగా మూడు చక్రాల స్కూటర్లను అందజేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి వారికి ఈ వాహనాలను ఉచితంగా అందజేయబోతోంది. ఇందుకోసం ఈనెల 25వ తేదీలోగా దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఆ గడువును ఈనెల 30వరకు పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 10 స్కూటర్లను దివ్యాంగ లబ్ధిదారులకు అందజేయనుంది. ఈ లెక్కన ప్రభుత్వం జిల్లాలోని 8 నియోజకవర్గాలకు 80 స్కూటర్లను ఇవ్వనుంది. 70శాతం కంటే పైన వికలత్వం కలిగి వాహనాన్ని నడపగలిగిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఈ వాహనాలను అందించనుంది. ఇందు కోసం దివ్యాంగులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను పంపుకోవాల్సి ఉంది. 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు ఉన్న వారు ఈ వాహనాలను పొందేందుకు అర్హులు.

డ్రైవింగ్ లైసెన్సులు లేక ఇబ్బందులు

రాష్ట్రప్రభుత్వం ఉచితంగా దివ్యాంగులకు అందించే మూడు చక్రాల మోటార్ వాహనాలను పొందేందుకు డ్రైవింగ్ లైసెన్సును తప్పనిసరి చేసింది. దీంతో అనేక మంది దివ్యాంగులు లైసెన్సులు లేక దరఖాస్తు చేసుకునేందుకు కూడా అర్హత కోల్పోయారు. ఇదే విషయాన్ని దివ్యాంగుల యూనియన్ నాయకులు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ దృష్టికి తీసుకుపోయారు. దీంతో ఆయన స్పందించారు. దివ్యాంగులకు లైసెన్సులు జారీ చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించారు. ఈనెల 21 నుంచి ఒంగోలులో దివ్యాంగులకు లెర్నర్ లైసెన్సు జారీ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. రవాణా శాఖ అధికారులు వీరికి ప్రత్యేకంగా లెర్నర్ లైసెన్సులు జారీచేయనున్నారు. ఇలా లెర్నర్ లైసెన్సులు పొందితే వీరు ప్రభుత్వం ఇచ్చే మూడు చక్రాల మోటారు వాహనాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హత పొందుతారు.

సదరమ్ సర్టిఫికెట్ తప్పనిసరి

దరఖాస్తు చేసేవారు వైద్యఆరోగ్యశాఖ ద్వారా జారీ చేసిన సదరమ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. ఆధార్ కార్డు, పదవ తరగతి ఉత్తీర్ణత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు విద్యార్థులు అయితే బోన్‌ఫైడ్ సర్టిఫికెట్, స్వయం ఉపాధి, ఏదైనా సంస్థలో పనిచేస్తున్న వారు అయితే ఉపాధి ధ్రువపత్రంతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ వాహనాలను పొందేందుకు కుటుంబ వార్షికాదాయం రూ.3లక్షలకు మించకూడదు. వాహనం నడిపేందుకు అవసరమైన డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి. గతంలో ప్రభుత్వం ద్వారాగాని, ప్రయివేట్ సంస్థల ద్వారాగాని ఈ యూనిట్‌ను తీసుకొని ఉండరాదు. దరఖాస్తుదారుని పేరుపైన ఇతర మోటారు వాహనం ఉంటే ఈ యూనిట్‌ను పొందేందుకు అనర్హులు అవుతారు. చదువు కొనసాగిస్తున్న వారిలో గ్రాడ్యుయేషన్ ఆ పైస్థాయి చదువులు చదివే వారికి ప్రాధాన్యత ఉంటుంది. పదవ తరగతి చదివి స్వయం ఉపాధి యూనిట్లు నడుపుతున్న దివ్యాంగులు, ఇతర విభాగాల్లో జీవనోపాధి పొందుతున్న వారికి కూడా ఈ స్కూటర్లు మంజూరు చేస్తారు. ఈ నెల 25వ తేదీ వరకు అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ అర్హులను ఎంపిక చేస్తోంది.

గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్న యోగా క్రీడ

ప్రజలలో పెరిగిన అవగాహన

పంగులూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : "నగరాలకు, పట్టణాలకే పరిమితమైన యోగా నేడు గ్రామీణ ప్రాంతానికి విస్తరించింది.. 2015 జూన్ 21న అంతర్జాతీయ యోగాడేగా గుర్తించడంతో ఈ క్రీడ విశ్వవ్యాప్తమైంది.. యోగా అంతర్భుఖమైంది, దీని ఫలితాలు దీర్ఘకాలంలో గుర్తించగలుగుతారు.." పంగులూరు మండలం చందలూరు గ్రామంలో మంగళవారం ముగిసిన రాష్ట్రస్థాయి యోగా పోటీల సందర్భంగా యోగా ప్రాధాన్యతను, అవసరాన్ని రాష్ట్ర పరిశీలకులు పూర్ణచందరరావు, రాజ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసరెడ్డిలు మంగళవారం ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

ప్రజల్లో పెరిగిన అవగాహన

అతి పురాతనమైన విద్యలలో ఒకటైన యోగాకు నేడు ప్రజల్లో అవగాహన పెరిగింది. యోగా సాధనతో విలువలు, వికాసం పెంపొందడంతో పాటు ఒత్తిడిని తట్టుకొనే శక్తి సిద్ధిస్తుంది. స్వయంశక్తితో ఎదిగేందుకు, స్వయం ఉపాధికి యోగా నేటి తరానికి ఓ విలువైన సాధనం. ఏడాది కాలంగా యోగా విద్యలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. కనీసం 250 ఆసనాలు అవపోశన పట్టినవారే ఈ క్రీడా పోటీలలో రాణించగలుగుతారు. పాఠశాల స్థాయి నుంచి యోగ విద్య సాధన చేస్తేనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలుగుతారు. ఎన్ఐఎస్. శిక్షణ పొందిన న్యాయనిర్ణేతలు ఎంతో పారదర్శకంగా విజేతలను నిర్ణయించారు.

పూర్ణచందరరావు, రాష్ట్రస్థాయి పోటీల పరిశీలకులు, కృష్ణజిల్లా

ఏకాగ్రతతోనే లక్ష్యసాధన



ఏకాగ్రతతోనే యోగాలో రాణించగలుగుతాం. నిర్దేశిత లక్ష్యం, నిరంతర సాధన యోగాలో ఎదిగేందుకు, విజయం సాధించేందుకు దోహదపడుతుంది. టిస్టింగ్, ఫార్వర్డ్ బెండింగ్, బ్యాక్‌వర్డ్ బెండింగ్, లెగ్‌బ్యాలెన్స్, హ్యాండ్ బ్యాలెన్స్ నిలబడి, కూర్చొని చేసే ఆసనాలపై పట్టుసాధించాలంటే ఏకాగ్రతతో కూడిన నిరంతర సాధన, ఎంతో అవసరం.

- రాజ్‌కుమార్, బాలికల పోటీల పరిశీలకులు, తూర్పు గోదావరి.

ఒత్తిడి సమస్యకు పరిష్కారం



ఒత్తిడితో కూడిన జీవన విధానం నుండి ఉపశమనం పొందేందుకు ఏకైక మార్గం యోగా. 15 ఏళ్లగా యోగ విద్యకు ఆదరణ పెరిగింది. గత ఏడాది జూన్ 21న విశాఖలో జరిగిన అంతర్జాతీయ యోగాడేతో గ్రామీణ ప్రాంతాలకు యోగా విస్తరించింది. మారుమూల గ్రామమైన చందలూరులో నగరాలకు దీటుగా రాష్ట్ర స్థాయి యోగా పోటీల నిర్వహణ ఇందుకు నిదర్శనం. ఇక్కడి ఆతిథ్యం చక్కగా ఉంది.

- డాక్టర్ శ్రీనివాసరెడ్డి అండర్-19 పోటీల పరిశీలకులు.

ఐఎంఏ జిల్లా నూతన కమిటీ



ఎంపికైన నూతన కమిటీ సభ్యుడు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. ఒంగోలులోని ఐఎంఏ హాలులో జరిగిన ఎన్నికల ప్రక్రియలో అధ్యక్షుడిగా డాక్టర్ ఎ.నాగయ్యానాయుడు, కార్యదర్శిగా ఎం.ఆనంద్, కోశాధికారిగా కె.సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డాక్టర్ మన్నే వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో ఎన్నికలు జరగ్గా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జాలాది మణిబాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు శివ, సీతారామయ్య, అపర్ణ, స్నేహ, స్వామి, ప్రశాంతి, రంగనాథ్‌బాబు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంలో ఉంచిన రూ.లక్ష చోరీ

వాహనం పక్కన ఉంచి టిఫిన్ చేస్తుండగా ఘటన

విచారణ చేపట్టిన చీరాల పోలీసులు

పేరాల(చీరాల), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంలో డబ్బులు ఉంచి టిఫిన్ చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీకు పాల్పడ్డారు. అందిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని బోయినవారిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం సీడీఎం మిషన్ ద్వారా బ్యాంకులో నగదు జమ చేసేందుకు వెళుతూ పేరాల వద్ద నగదును వాహనంలో ఉంచి రోడ్డు పక్కన టిఫిన్ చేశాడు. కొద్దిసేపటి తరువాత చూసుకోగా వాహనంలో నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. ఈ మేరకు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు దివ్యాంగులకు క్రీడా పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ప్రోత్సహించేందుకు జిల్లా క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27న ఒంగోలులోని మినీ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడాశాఖ అధికారి జి.రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బ్యాడ్మింటన్, అండర్ -20, జూనియర్స్ కేటగిరిలో చెస్, 100 మీటర్లు షార్ట్ పుట్, డిస్కస్ త్రో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎవరైనా వైకల్య నిర్ధారణ ధ్రువపత్రంతో ఉదయం 9గంటలకు మినీ స్టేడియం వద్దకు హాజరు కావాలన్నారు.

అవీఇవీ

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు చినగంజాం విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

చిన గంజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సత్యం హైస్కూల్‌కు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ నున్నా హరనాథ్‌బాబు మంగళవారం తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గాలి శ్రీనివాసరెడ్డి ఇటీవల కర్నూలు జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్ జిల్లాల అండర్-17 కబడ్డీ పోటీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా తరపున పాల్గొన్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీనివాసరెడ్డి ప్రతిభ సాటి అండర్-17 రాష్ట్ర కబడ్డీ బాలుర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో జరగనున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలలో శ్రీనివాసరెడ్డి రాష్ట్ర అండర్-17 బాలుర కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ తెలిపారు. రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికైన శ్రీనివాసరెడ్డికి పాఠశాల డైరెక్టర్ హరనాథ్‌బాబు, హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు టి.రమేష్‌బాబు, విజయ్‌కుమార్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు వాడరేవు విద్యార్థిని

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని వాడరేవు ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని పిక్కీ ఝాన్సీ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. మత్స్యకార కుటుంబానికి చెందిన చిన్నారి ఇటీవల మచిలీపట్నంలో జరిగిన అండర్ -14 విభాగంలో ఉత్తమ ప్రదర్శన అందించింది. దీంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు రత్నకుమారి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సుమన్, సుమలత తదితరులు ఝాన్సీని అభినందించారు.

సెయింట్ ఆన్స్ అధ్యాపకునికి జాతీయ అవార్డు



అధ్యాపకునికి అవార్డు పత్రాన్ని అందిస్తున్న ప్రతినిధులు

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల అధ్యాపకులు టీ గోపాలరావుకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అవార్డు గ్రహీత అకడమిక్ ఇయర్ ఉత్తమ బోధనకు న్యూఢిల్లీ ఆల్ఫా ఇంటర్నేషనల్ పబ్లికేషన్స్ సంస్థ అవార్డును అందించింది. ఈక్రమంలో మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపల్ జగదీష్, ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.లక్ష్మీతులసీ చావలి, మొదటి సంవత్సరం ఇన్‌చార్జ్ అమర్‌నాథ్ బాబు, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

అయ్యప్ప శరణు ఘోషతో పులకించిన పూసపాడు



పూసపాడులో చేస్తున్న అయ్యప్ప పడిపూజ

ఇంకొల్లు,నవంబరు 25,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూసపాడులో అయ్యప్పస్వామి పడి భజనా అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త రఘురాం గురుస్వామి ఆధ్వర్యంలో పడి భజనా కార్యక్రమం నిర్వహించారు. భారీ ఎత్తున అరటి మందిరాలు ఏర్పాటు చేశారు. అయ్యప్ప శరణఘోషతో పూసపాడు పులకించింది. గురుస్వాములతో అయ్యప్పకు ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా పూలు, పండ్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో మాలధారణ చేసిన స్వాములు హాజరై పూజలో పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాలు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

క్రికెటర్ కరుణకుమారికి 'గొట్టిపాటి' రూ.5 లక్షల ప్రోత్సాహం

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత జట్టు అంధుల మహిళా టీ 20 వరల్డ్ కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన విశాఖ బాలికల అంధుల రెసిడెన్షియల్ విద్యార్థిని కరుణ కుమారికి కిషోర్ గ్రానైట్స్ అధినేత గొట్టిపాటి హర్ష రూ. 5 లక్షల ప్రోత్సాహకం ప్రకటించినట్లు రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో కరుణకుమారి చూపిన ప్రతిభకు ప్రోత్సాహకంగా గొట్టిపాటి హర్ష ప్రోత్సాహకం ప్రకటించినట్లు మంత్రి తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుకు రావడం అభినందనీయమని హర్షకు అభినందనలు తెలియజేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

నేను మంత్రి గారి ఇలాకా...!

రెచ్చిపోతున్న అధికారి.. మైనింగ్ శాఖలో కోల్డ్‌వార్

కార్యాలయం భూమిపూజలో ప్రస్ఫుటం

ఒంగోలు క్రైం,నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గనులు, భూగర్భవనరుల శాఖ కార్యాలయంలో ఓ అధికారి పనితీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. 'నేను మంత్రిగారి ఇలాకా' అంటూ ఓ అధికారి కార్యాలయంలో అన్నీ పనులు చక్కబెడుతున్నారు. ఈనెల 23న ఒంగోలు సౌత్ బైపాస్ రోడ్డులో గనులు శాఖకు సంబంధించిన కార్యాలయం నిర్మాణం కోసం ఇరువురు మంత్రులు చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంతా తానే అన్నట్లుగా పనులు చక్కబెట్టిన అధికారి శిలాఫలకంపై వేసిన పేర్ల విషయంలో కూడా వివాదాస్పదులుగా మారారు. ఎక్కడా భూగర్భగనుల శాఖ కార్యాలయం సిబ్బంది అని రాయకపోవడం అక్కడ పనిచేసే వారంతా మనస్తాపానికి గురయ్యారు. దీంతో శనివారం సాయంత్రం విషయాన్ని కార్యాలయంలో పనిచేస్తున్న ఉన్నతాధికారి దృష్టికి సిబ్బంది తీసుకెళ్లారు. అంతే కాదు తాము ఆదివారం జరిగే కార్యక్రమానికి రాలేమని కూడా చెప్పారు. ఈ మేరకు సిబ్బందిని ఉన్నతాధికారి బుజ్జగించి తమ కార్యాలయం కోసం శంకుస్థాపన జరుగుతుందని సర్దిచెప్పారు. అదేసమయంలో గనుల శాఖలో మరో విభాగంలో పనిచేసే అధికారి పేరు శిలాఫలకం మీద లేకపోవడం గుర్తించారు. దీంతో ఆ అధికారి మరింత కోపోద్రిక్తుడై తన కంటే తక్కువ స్థాయి అధికారుల పేర్లు శిలాఫలకం మీద ఉన్నాయి.. తన పేరు లేకపోవడం ఏమిటి అంటూ ఉన్నతాధికారి దగ్గరకు పోయినట్లు తెలిసింది. దీంతో ఉన్నతాధికారి తనకేమీ తెలియదని వెంటనే మార్పులు చేయిస్తానని చెప్పి, అధికారి పేరును ప్రింట్ చేసిన స్టిక్కర్లతో వేయించారు. శిలాఫలకంపై జరిగిన చర్చను కొంతమంది గ్రానైట్ యజమానులు ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. కార్యాలయంలో తాను మంత్రి గారి ఇలాకా అని చెప్పుకునే అధికారి నిర్వాకం సిబ్బంది, అధికారుల మధ్య కోల్డ్‌వార్‌గా మారింది. ప్రస్తుతం సిబ్బంది ఈ వ్యవహారంపై కినుక వహించినట్లు తెలిసింది.

అవీ..ఇవీ..

వివాహిత ఆత్మహత్య

● భర్త వేధింపులే కారణమని తండ్రి ఫిర్యాదు

మేదరమెట్ల నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్రవానిపాలెంకు చెందిన వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుర్రవానిపాలేనికి చెందిన మోంద్రు అనితను కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన శీలం బ్రహ్మానాయుడికిచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. ఇటీవల ఆమె ప్రసవం కోసం పుట్టింటికి వచ్చింది. ఇక్కడ ఒక కుమార్తెకు జన్మనిచ్చింది. అయితే అనిత భర్త, అత్తమామలు అదనపు కట్నం తేవాలని మానసికంగా, శారీరకంగా హింసించేవారు. ఇటీవల ఆమెకు ఆడపిల్ల పుట్టడంతో ఈ వేధింపులు మరింత ఎక్కువయ్యాయని అనిత తండ్రి లక్ష్మీనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 'రూ.20 లక్షలు కట్నం తెస్తే ఇంటికి రావాలని, లేదంటే అక్కడే చావాలి' అని భర్త బెదిరించడంతో తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. దీంతో ఈ నెల 20న తన కుమార్తె పురుగు మందు తాగగా, ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందనట్లు తెలిపారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

● ఈపూరుపాలెంలో కేసు నమోదు

ఈపూరుపాలెం(చీరాల), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఈపూరుపాలెం పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ట్రాక్టర్లను స్టేషన్ పరిధిలోని బోయినవారిపాలెం వైపు నుంచి ఈపూరుపాలెం వైపు వస్తుండగా మార్గ మధ్యలోని రైలు గేటు వద్ద ట్రాక్టర్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు డ్రైవర్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

సంఘటితంతో స్వచ్ఛ చీరాలను సాదిద్దాం

● పురపాలక సంఘం సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది, ప్రజలు సంఘటితం కావాలని, తద్వారా స్వచ్ఛ చీరాల సాధ్యమని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ సమావేశ మందిరంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్, ఎమినిటీ సిబ్బంది, వార్డువెల్ఫేర్, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చెత్త సేకరణ, వేస్ట్ ప్రాసెసింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ అబ్దుల్ రషీద్, అసిస్టెంట్ ఇంజనీరు గీతాశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీల హక్కులపై అవగాహన అవసరం




న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాదులు

అద్దంకిటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్త్రీలకు ఉన్న హక్కులు, హింసకు గురైనప్పుడు చట్టం ద్వారా వారు పొందగల సదుపాయాలు, ఇతర చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఉచిత న్యాయ సహాయకులు టి. మార్త శ్రీను అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఇందిరానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం నందు మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతు ఐ క్యరాజ్య సమితి తీర్మానం మేరకు ప్రతి సంవత్సరం నవంబరు 25వ తేదిన స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింసా వ్యతిరేక దినం నిర్వహించడం జరుగుతుందన్నారు. స్త్రీలపై అత్యాచారాలు, గృహహింసలు, లైంగిక వేధింపులు ఎ క్కువ అవుతున్నాయన్నారు.స్త్రీలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వీటిని అరికట్టడం ప్రయత్నంలో భాగంగా అందరు స్త్రీల హక్కులు, చట్టల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మహమ్మద్ రఫీ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, మహిళలు పాలొన్నారు.

స్త్రీ, పురుష సమానత్వంపై అవగాహన

పంగులూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్త్రీ, పురుష సమానత్వంపై మహిళలకు అవగాహన కల్పించాలని, రక్షణ చట్టాల గురించి, అన్ని రంగాలలో మహిళలకు ఉపాధి అవకాశాల గురించి తెలియచేయాలని ఎంపీడీవో స్వరూపారాణి అన్నారు. ఈ నెల 25 నుంచి డిసెంబరు 23 వరకు వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించనున్న జండర్ అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీవో స్వరూపారాణి లాంఛనంగా ప్రారంభించారు. వీవోఏలు, మండల సహాఖ్య ప్రతినిధులు ఎస్.హెచ్.గ్రూప్ సభ్యులకు మహిళల కోసం నిర్దేశించిన చట్టాల గురించి తెలియ చేయాలన్నారు. మండల సమాఖ్య ప్రతినిదుల అవగాహన కోసం ఎంపీఎం అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాది సూరి, జండర్ కమిటీ సభ్యులు, వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం కృషి



కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

పర్చూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీఎం కే.రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయం ప్రాంగణంలో నయీ చేతన్ 4.0 ముందడుగు కార్యక్రమంలో భాగంగా జండర్ వివక్షతకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మహిళ జీవనోపాధిని బపోపేతం చేయటం, ఆర్థిక సాధికారిత ప్రేరణ శక్తులుగా అభివృద్ధి చెందటంతోపాటు, స్త్రీ, పురుషుడు సమానమే అన్న విధంగా అవగాహన కల్పించటమే కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీనియర్ సహాయకులు నారాయణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ దీప, సీసీలు శ్రీనివాస మూర్తి, విజయ్‌కుమార్, నరసింహారవు, గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ చీరాల యూనిట్ కమిటీ మంగళవారం ఎంపికైంది. అధ్యక్షులుగా చుక్కా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ప్రతాప్, సుశీల స్వామి, జిల్లా కౌన్సిలర్లుగా వెంకటేశ్వరరెడ్డి, నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో నూతన కమిటీను పలువురు అభినందించారు.

గోతులమయంగా పంగులూరు- ముప్పవరం రహదారి

రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనచోదకులు



జనకవరం అడ్డరోడ్డు సమీపంలో గోతులమయంగా ఉన్న ఆర్అండ్‌బీ రహదారి

పంగులూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పంగులూరు - ముప్పవరం గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గోతులపై రాకపోకలు సాగించడం యిబ్బందిగా మారింది. మండల కేంద్రం నుంచి ముప్పవరం చేరుకునే ప్రధాన రహదారిలో జనకవరం అడ్డరోడ్డుకు సమీపంలో ఇరువైపులా లోతైన గోతులు ఏర్పడ్డాయి. ఇదే రహదారిలో కొండమూరు అలుగు సమీపంలో మరియు ఆదిరెడ్డిబావి నుండి ముప్పవరం మధ్య పలుచోట్ల రోడ్డుమధ్యలో అడుగడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. గత టి.డి.పి. పాలనలో పంగులూరు, ముప్పవరం గ్రామాల మధ్య బి.టి. రోడ్డు నిర్మాణం జరిగింది. నాటి నుండి తరచూ ఈ రోడ్డుపై ఏర్పడిన గోతులు పూడ్చేందుకు ఆర్ అండ్ బీ అధికారులు అరకొర మరమ్మత్తులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గోతులకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టినా గడిచిన ఏడాది కాలంగా వర్షాలకు జనకవరం, ముప్పవరం గ్రామాల మధ్య అనేకచోట్ల గోతులు ఏర్పడంతో ద్విచక్ర వాహనచోదకులు రాకపోకలు సాగించడంలో అవస్థలు పడుతున్నారు. ఇంకొల్లు, పంగులూరు పరిసర ప్రాంతాల నుండి 16వ నెంబరు జాతీయ రహదారికి చేరుకుని అద్దంకితో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్ళేందుకు నిత్యం వందల సంఖ్యలో వాహనచోదకులు రేయింబవళ్ళు రాకపోకలు సాగిస్తుంటారు. అద్దంకి. ఇంకొల్లు మధ్య నడిచే ఆర్.సి. బస్సులతో పాటు పలు ప్రాంతాల నుండి సిమెంట్, కంకర, ఇసుక ఇతర సరుకు రవాణా చేసే లారీలు, ట్రాక్టర్లు, వైద్యం కోసం, ఇతర పనుల నిమిత్తం పలు గ్రామాల ప్రజలు కారుల్లో ప్రయాణం సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ ప్రధాన రహదారిలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా గోతులకు కనీస మరమ్మత్తులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతన్నారు.

యూటీఎఫ్ మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు వెంకట్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు

చినగంజాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన కౌన్సిల్ నిర్మాణం ఏకగ్రీవంగా ఎన్నికైంది. యూటీఎఫ్ బాపట్ల జిల్లా సహాధ్యక్షులు బి.బిక్షాలుబాబు నూతన కమిటీ ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.పాపారావు వ్యవహరించారు. ఎంపికైన నూతన మండల కమిటీ వివరాలను ఆయన తెలియజేశారు. యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షులు సీ.హెచ్.ఎస్‌వీ. సుబ్బారావు, అధ్యక్షులు చుండూరి వెంకట్, ఉపాధ్యక్షులు షేక్.నాయబ్‌రసూల్, ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీనివాసరావు, కోశాధికారి నంగు శ్రీనివాసరావు, మహిళా ఉపాధ్యక్షురాలు కేవీఎస్. సునీత, మహిళా కార్యదర్శి పి.హిమవంతేశ్వరి, జిల్లా కౌన్సిలర్స్ వి.రవికుమార్, టి.నాగమల్లేశరరావు, డి.హరిపురుషోత్తం, పి.సరళ, కార్యదర్శులు పీ.శ్రీనివాసరావు, యూ.సాంబశివరావు, ఎం. సురేష్, బిఎస్. నాగేశ్వర రావు, ఎల్.శివప్రసాద్, సీ.హెచ్. కుమార్, డి. సుబ్బారావు, సీ.హెచ్. బాజిబాబు, ఎస్.ధనలక్ష్మి, కే.వెంకటరావు, ఎస్.సురేష్, మహిళా విభాగం కన్వీనర్ ఎం.విజయ కుమారి, టి.సౌజన్య, ఎన్.అనంత లక్ష్మి, బి. ఉమాదేవి, ఎన్. శివనాగమణి, ఐటీ విభాగం ఎస్.కోటయ్య, కే.రామకోటిరెడ్డి, అకడమిక్ సెల్‌విభాగానికి పి.మురళీకృష్ణ, వై.రామాంజ నేయులు, ఎన్.సోమయ్య, ఆడిట్ కమిటీ సభ్యులుగా కేవీ.సుబ్రహ్మణ్యం, కే.మాధవీలత, ఎస్. సుప్రియ, సీపీఎస్ విభాగం కన్వీనర్ వి.వెంకటేశ్వరరావు, కో కన్వీనర్ పి.ఆదిలక్ష్మి, సభ్యులు పీవీ.శ్రీబాబు, సీ.హెచ్.శ్రీనివాస రావు, పి.రామాంజనేయులు, సాంస్కృతిక విభాగం కమిటీ సభ్యులు బి.వీరేశ్వర శాస్త్రీ, జి.నాగేశ్వరమ్మ, కే. హేమలత, పత్రికలు ముతకని శ్రీనివాసరావు, కుటుంబసంక్షేమ పథకం సభ్యులు బివి.రమేష్‌బాబు, కాంప్లెక్స్ బాధ్యులు పెదగంజాంకు జి.రాజబాబు, టి.అమృతబాబు, ఎస్.శ్రీనివాసరావు, కే.కృష్ణవేణి, కడవకుదురుకు బి.భాస్కర్, ఎస్.శ్రీనివాసరావు, పీ.నాగేశ్వరరావు, షేక్.ఫిరోజ్‌లు ఎంపికైనట్లు పాపారావు తెలిపారు.

ఉద్యాన పంటలతో అధిక ఆదాయం



పండ్లతోటను పరిశీస్తున్న ఉద్యాన అధికారి దీప్తి

అద్దంకిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలతో ఆధిక ఆదాయం పొందవచ్చని మండల ఉద్యాన శాఖ అధికారిణి ఎస్.దీప్తి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం, విప్పర్లవారిపాలెం గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలల్లో సాగు చేసిన ఉద్యాన పంటలను ఆ మె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ మె మాట్లాడుతు ఉద్యాన పంటలైన డ్రాగన్ ఫ్రూట్స్, జామ, కొబ్బరి సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో ప్రతి రైతు తమ వివరాల ను గ్రామ వ్యవసాయ సహాయకులకు అందించా లని తెలిపారు. వారు వ్యవ సాయ శాఖ రూపొందించి న యాప్ సంబంధిత రైతులకు డౌన్‌లోడ్ చేస్తా రని, ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడు తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనిగల శాంతమ్మ, ఏఈవో కోటేశ్వరరావు, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, వీఏవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చినగంజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుంచి మినహాయించాలని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఈ విషయంలో జోక్యం చేసుకొని కోర్టులో రివ్యూ పిటిషన్ వేయించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కే.శ్రీని వాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు మెట్టు శ్రీనివాసరావు అధ్య క్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయు లకు బోధనేతర పనులు రద్దు చేస్తామని చెప్పినప్పటికీ ఆన్‌లైన్‌లో పనులు చేయిస్తూ ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారన్నారు. విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి అసెస్‌మెంట్ పుస్తకాల విష యంలో పునరాలోచించాలని, సింగల్ ఉపాధ్యాయులు పనిచేస్తున్న పాఠశాలల్లో పాఠశాల పని దినాలు 225 ఉన్నచోట్ల ఎల్‌హెచ్, ఓ.హెచ్‌ల రోజులలో పాఠశాలలకు సెలవు ప్రకటించుకునే అవకాశం ఇవ్వాలని అన్నారు. పెండింగ్ ఆర్థిక బకాయిలను చెల్లించాలని, పీఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్ 30 శాతం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత జూన్‌లో బదిలీలు జరిగి ఇంకా రిలీవ్ కాని వారిని వెంటనే రిలీవ్ చేయాలని శ్రీనివాస రావు కోరారు. కార్యక్రమంలో యూటీ ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.పాపారావు, జిల్లా ఉపాధ్యక్షులు బి.బిక్షాలుబాబు, జిల్లా కార్యదర్శి పి.సురేష్, రాష్ట్ర కౌన్సిలర్ బి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డప్పుకళను జాతీయ స్థాయిలో గుర్తించాలి



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్

ఒంగోలు(రూరల్), నవంబరు25 (ఆంధ్రజ్యోతి): డప్పు కళను జాతీయ కళగా గుర్తించాలని రాష్ట్ర డప్పు కళాకారుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులో డప్పు కళాకారుల మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ మాట్లాడుతూ డప్పు కళాకారులు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. డప్పు కళాకారులకు అర్హతల మేరకు పింఛన్లు వచ్చేవిధంగా చేస్తానని, ఎలాంటి సిఫార్సులు అవసరం లేదన్నారు. టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాస రావు మాట్లాడుతూ డప్పు కళను అంతరించి పోకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కళను తాను ఎప్పటికీ ప్రోత్సహిస్తానని తెలిపారు. డప్పు కళాకారు ల సంఘ రాష్ట్ర నాయకుడు గుండిమెడ క్రాంతికుమార్ మాట్లాడుతూ డప్పు కళా కారులకు ఇప్పుడు ఇస్తున్న పింఛను పెంచాల న్నారు. ప్రతినెలా రూ.7వేలు ఇవ్వాలని కోరారు. కేవలం దీనిపై ఆధారపడ్డ కళాకారులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు కంకణాల ఆంజనేయులు, బి.రఘురామ్, శివాజీరాజు, అట్లూరి రాఘవులు, టి.రామా రావు, కత్తి యోబు తదతరులు పాల్గొన్నారు. అంతకుముందు డప్పు కళాకారులు నగరంలో డప్పులు వాయిస్తూ ప్రదర్శన నిర్వహించారు.

26న కృష్ణంరాజుపాలెంలో ప్రత్యేక పూజలు

మేదరమెట్ల నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా మండలంలోని పమిడిపాడు శివారు కృష్ణంరాజుపాలెంలో వేంచేసిన సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలతో పాటు కలశం, కావడుల ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. 46 అడుగుల ఎత్తైన సుబ్రహ్మణ్యస్వామి ఏకశిల విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు స్వామివార్ల కల్యాణ మహోత్సవం

పర్చూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో వేంచేసియున్న స్వామివార్ల పుట్ట వద్ద శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వార్ల కళ్యాణ మహోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తేళ్ళ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ నిర్మాణం చేపట్టి 50 ఏళ్ల పూర్తిఅయిన సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల కల్యాణ వేడుకలను తిలకించి భక్తిని చాటుకోవాలని కోరారు.

క్రిస్మస్‌కు స్వాగతం పలుకుతూ ప్రార్థనలు



ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

యద్దనపూడి,(మార్టూరు) నవంబరు25 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో జరగనున్న క్రిస్మస్ పండుగకు స్వాగతం పలుకుతూ మంగళవారం యద్దనపూడిలోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. పవిత్ర మాసం క్రిస్మస్ కు నెలరోజుల ముందుగా ఉదయకాల ఆరాదన కాలాన్ని ఘనంగా ప్రారంభించారు. క్రీస్తురాకను ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వైఏ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

● 63 మంది ఎంపిక

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం క్యాంపస్ డ్రైవ్ జరిగింది. ఈక్రమంలో హైదరాబాద్ నుంచి ఫాక్స్ కాన్ కంపెనీ, తిరుపతి నుండి నియో లింక్ కంపెనీ, తడ శ్రీసిటీ పరిధిలోని డైకిన్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈక్రమంలో 63 మంది విద్యార్థులు ఎంపిక కావడంపై ప్రిన్సిపల్ డా.ఎన్ మురళీ ప్రత్యేకంగా అభినందించారు. ఎంపికైన వారు డిసెంబరు 1 నుండి ఉద్యోగాల్లో చేరనున్నట్లు చెప్పారు.

పందిళ్లపల్లి విద్యార్థినికి కాంస్య పతకం

పందిళ్లపల్లి(చీరాల), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ అబ్బు పూజిత స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేష్ అండర్ -17 విభాగంలో కాంస్య పతకం సాధించింది. వినుకొండలో సోమ, మంగళవారాల్లో జరిగిన ఈ పోటీల్లో హేమర్ త్రోలో ప్రతిభ కనబరిచింది. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు పూజితను అభినందించారు.

భారత రాజ్యాంగంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు

కఠారిపాలెం(చీరాల), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం కఠారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. భారత రాజ్యాంగం దినోత్సవం పురస్కరించుకుని జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేయించడం, బోధనాభ్యాసం సామాగ్రి తయారీ చేయించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసమే 'రైతన్నా మీకోసం'



రైతులకు బ్రోచర్లను అందచేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

మార్టూరు, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతికను అనుసంధానం చేయడం ద్వారా మేలైన దిగుబడులను సాదించడం, నాణ్యమైన ఉత్పత్తులను పొందడం సాధ్యమని ఏవో కుమారి అన్నారు. యద్దనపూడి మండలంలో రైతుసేవా కేంద్రాలలో 'రైతన్నా మీకోసం' ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం మండలంలోని పోలూరు, గన్నవరం గ్రామాలలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో కుమారి ఆధ్వర్యంలో వ్యవసాయ సిబ్బంది ఇంటింటా తిరుగుతూ బ్రోచర్లును రైతులకు పంపిణీ చేశారు. పోలూరు గ్రామంలో టీడీపీ నాయకులు రావిపాటి సీతయ్య, గన్నవరం గ్రామంలో నల్లపనేని రంగయ్యచౌదరిల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 29 వరకు ప్రచారం నిర్వహిస్తామని ఏవో తెలిపారు. కార్యక్రమంలో పశువర్థక సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మో వానరాలు..!



పర్చూరులో కోతుల సంచారం, గాయపడిన వృద్ధుడు

పర్చూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో వానరాల బెడత తీవ్రతరంగా మారింది. విచక్షణా రహితంగా దాడులు చేయటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గుంపులు గుంపులుగా వచ్చి మరీ దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. చేతిలో ఏమైన తినుబండారాలు ఉన్నా, లేకున్నా దాడులకు పాల్పడుతుండటంతో ఒకింత ప్రజలు కలవరానికి గురవుతున్నారు. గడిచిన పక్షంరోజుల్లో అనేక మంది వానరాల దాడిలో గాయపడి ఆసుపత్రి పాలయ్యారంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఒంటరిగా బయటకు రావాలంటే ప్రజలు భయపడాల్సిన దుస్థితి నెలకొంది. నిత్యం వందల సంఖ్యలో ప్రజలతో రాకపోకలు సాగించే బ్యాంక్‌లు, కోర్టు సమీపంలో పరిస్థితి మరింత ఇబ్బంది కరంగా మారింది. ఈమార్గంలో పదుల సంఖ్యలో కోతులు ఆవాసాలను ఏర్పాటు చేసుకొని పాదచారులపై విచక్షణా రాహిత్యంగా దాడులు చేసి గాయపరుస్తున్నాయి. ఇలాంటి ఘటనలు అనేకం ఉన్నాయి. పర్చూరు లాయర్ వీధిలో ఓ వృద్ధునిపై కోతులు దాడిచేసి తీవ్రంగా గాయపరచడంతో ఆయన్ను వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. కోతుల దాడుల నుండి విముక్తి కల్పించండి అని ఎన్నిమార్లు స్థానిక పంచాయితీ అధికారులకు విన్నవించుకున్నా తమ గోడు పట్టించుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు.

కొండముచ్చుతో సరి...

పెద్ద సమస్య తెలిత్తినా, వార్తా పత్రికల్లో కథనాలు వెలువడిన తరుణంలో కొండ ముచ్చును తీసుకొచ్చి సరిపెట్టడం మినహా తీసుకుంటున్న చర్యలు లేవు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడద నుండి కాపాడాలని ప్రజలు కోరతున్నారు. ఆదిశగా అధికారులు యుద్ధ ప్రాతిపతికన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.